ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 గురువారం 31 జూలై 2025 సంపుటి: 01, సంచిక : 86
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## ఐటి పరిశ్రమలో ఇక కోతలే!

భారత ఐటి రంగంలో మరిన్ని ఉద్వాసనలు చోటు చేసుకోనున్నాయని ఐటి సేవల కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే నాస్కామ్ అంచనా వేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమలో పెను మార్పులు వస్తున్నాయని పేర్కొంది. ఈ దశలో రాబోయే నెలల్లో మరిన్ని ఉద్యోగ కోతలు జరిగే అవకాశం ఉందని నాస్కామ్ మంగళవారం ఓ రిపోర్ట్‌లో హెచ్చరించిం ది. దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ప్రపంచ వ్యాప్తంగా 2 శాతానికి సమానమయ్యే 12,000 మందిపై వేటు వేస్తోన్న నేపథ్యంలో నాస్కామ్ ప్రకటనకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఐటి పరిశ్రమకు ఇది ఓ మలుపు సమయని పేర్కొంది. "ప్రపంచవ్యాప్తంగా క్లయింట్‌లు ఐటి సేవల నుండి వేగవంతమైన, సౌలభ్యమైన, ఆవిష్కరణాత్మక ఫలితాలను డిమాండ్ చేస్తున్నారు.


విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news



# ఉచితాల కోసం కొత్త డిస్కమ్

- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- రాష్ట్రం యూనిట్‌గా ఏర్పాటు చేయాలని సూచన
- వ్యవసాయానికి, ఇళ్లకు, స్కూళ్లు, కాలేజీలకిచ్చే ఉచిత విద్యుత్ దీని పరిధిలోకి..
- విద్యుత్ రంగంలో సంస్కరణలు తప్పనిసరి అని స్పష్టీకరణ
- రుణాలపై వడ్డీ భారం తగ్గేలా చర్యలు చేపట్టాలన్న సీఎం
- విద్యుత్ శాఖపై డిప్యూటీ సీఎం భట్టితో కలిసి సమీక్ష



సూర్య హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా మరో విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్) ఏర్పాటు కానుంది. వ్యవసాయానికి, ఇళ్లకు 200 యూనిట్ల వరకు, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఇచ్చే ఉచిత విద్యుత్‌ను పర్యవేక్షించేందుకు వీలుగా ఒక ప్రత్యేక డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇది రాష్ట్రం యూనిట్‌గా పని చేస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. డిస్కమ్‌ల స్థితిగతులు, ఆర్థిక క్రమశిక్షణ మెరుగుపడాలంటే విధిగా విద్యుత్ సంస్కరణలు అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వివిధ ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలపై వడ్డీ భారం - మిగతా 2లో




## నింగిలోకి నైసార్

- జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ప్రయోగం విజయవంతం
- దిగ్విజయంగా కక్ష్యలోకి చేరిన ఇస్రో-నాసా ఉమ్మడి ఉపగ్రహం
- భూమి ఉపరితలం పరిశీలన, వాతావరణ మార్పులపై అధ్యయనం
- భూమిని స్కాన్ చేసే పనిలో అప్పుడే నిమగ్నం
- హసన్‌లోని మాస్టర్ కంట్రోల్ సెంటర్‌కు సిగ్నల్స్



## సునామీ ప్రకంపనలు

- రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రతతో సంభవించిన భూకంపం
- రష్యా, జపాన్, అమెరికా, హవాయ్ తీరాలను తాకిన భీకర సునామీ అలలు
- రష్యా తూర్పు తీరం వెంబడి పసిఫిక్ మహాసముద్రంలో మొదలైన ప్రకంపనలు



## కాంగ్రెస్ ధారాదత్తం చేసింది

- పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను మేం తిరిగి తీసుకొస్తాం
- " దేశ భద్రత అనేది కాంగ్రెస్ ప్రాధాన్యతాంశాల్లో అస్సలు లేదు
- ఓటు బ్యాంక్, బుజ్జగింపు రాజకీయాలు మాత్రమే కాంగ్రెస్ అజెండా.
- రాజ్యసభలో అమిత్ షా

## నేడు 'కాళేశ్వరం' కమిషన్ నివేదిక



సూర్య హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ నిర్వహించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. నివేదిక తీసుకునేందుకు గురువారం ఉదయం 9 గంటలకు తమ కార్యాలయానికి రావాలని నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాను కమిషన్ కోరింది. జస్టిస్ చంద్రఘోష్ ఆయనకు సీల్డ్ కవర్‌లో నివేదికను అందించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చి 14న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. 115 మంది సాక్షులను విచారించిన కమిషన్ తుది నివేదికను సిద్ధం చేసింది.

## 25 శాతం సుంకాలు

### భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాంబ్

- రష్యాతో వ్యాపారం చేస్తున్నందుకు అదనంగా జరిమానా కూడా...
- ఆగస్టు 1 నుంచి అమల్లోకి నిర్ణయాలు: ట్రంప్ ప్రకటన
- మోదీ ప్రభుత్వ ఘోర వైఫల్యం... మండిపడ్డ కాంగ్రెస్, విపక్షాలు
- దేశ ప్రయోజనాలను కాపాడతాం: కేంద్రం



సూర్య హైదరాబాద్

కేంద్రం భారత్‌పై 25 శాతం సుంకాల విధింపు, రష్యాతో వర్తకం చేస్తున్నందుకు జరిమానా ప్రకటన తాలూకు ప్రభావాన్ని మదింపు చేస్తున్నట్టు కేంద్రం పేర్కొంది. ఈ విషయంలో దేశ ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. "ఇరు దేశాలకూ ఆమోదనీయ, లాభదాయక రీతిలో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు కట్టుబడి ఉన్నాం. కొద్ది నెలలుగా ఆ దిశగాఅత్యున్నత స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి"అని గుర్తు చేసింది. వీటిలో భాగంగా ఆరో రౌండ్ చర్చల - మిగతా 2లో

## ఎమ్మెల్యేల ఫిరాయింపుపై నేడు సుప్రీం తీర్పు

- ఈకేసుపై సీజే ధర్మాసనం కీలక తీర్పు ఇవ్వనున్న నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ
- ఈ ఫిరాయింపుల కేసుపై చివరిసారిగా ఏప్రిల్ 3న జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టైన్ జార్జి మసీలతో కూడిన ధర్మాసనం

2లో



## పోరుబాటలో పార్టీ సైతం



- బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం కాంగ్రెస్ చలో ఢిల్లీ
- ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొననున్న పీసీసీ చీఫ్, ఇతర నేతలు
- ధర్నా కోసం ప్రత్యేక రైలు.. ప్రతి జిల్లా నుంచి 50 మంది తరలింపు
- సీఎం రేవంత్‌తో మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్ భేటీ

సూర్య హైదరాబాద్

బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో ఢిల్లీ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కార్యాచరణలో పాలుపంచుకోవాలని నిర్ణయించింది. మూడురోజుల పాటు కాంగ్రెస్ ముఖ్య నేతలంతా ఢిల్లీలోనే మకాం వేయనున్నారు. ఆగస్టు ఆరో తేదీన జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో పార్టీ శ్రేణులు పాల్గొనేలా.. ప్రత్యేక రైలులో ప్రతి జిల్లా నుంచి కనీసం 50 మందిని పంపనుంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేసుకుంటోంది. - మిగతా 2లో



## ఆయన చైనా గురు

- అందుకే బీజింగ్ ఒలింపిక్స్‌కు వెళ్లారు
- రాహుల్‌గాంధీపై జైశంకర్ పరోక్ష విమర్శలు
- ముగ్గురు ఉగ్రవాదుల తలలు లేపేశాం: అమిత్‌షా
- రాజ్యసభలో కొనసాగిన చర్చ.. చివర్లో విపక్షం వాకౌట్

## మాపై తోస్తే ఎట్లా

### ఏపీ నుంచి ఐదు పంచాయతీలను వెనక్కి తీసుకురావడంపై పార్టీ పరంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- భద్రాద్రి ఆలయానికి కేంద్రం నిధులివ్వాలి
- రాష్ట్ర ప్రభుత్వం కూడా అభివృద్ధి చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



సూర్య హైదరాబాద్

ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన పాపాన్ని తమ మీదకు తోస్తే ఎట్లా? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ప్రశ్నించారు. విభజన సమయంలో ఏపీలోకి వెళ్లిన కొన్ని ప్రాంతాల విషయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అప్పటి కేంద్ర సర్కారు, తెలంగాణ ఆవిర్భవిస్తున్న సమయంలో బీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయాలనే కేంద్రంలో తాము అధికారంలో వచ్చాక అమలు చేశాం - మిగతా 2లో

# సునామీ ప్రకంపనలు

**టోక్యో/మాస్కో/వాషింగ్టన్/న్యూఢిల్లీ**

రష్యా సమీప పసిఫిక్ మహాసముద్రగర్భంలో జనించిన ప్రళయ భీకర సునామీ రెప్పపాటులో ఆ సముద్ర తీర దేశాలను చివురుటాకులా వణికించింది. సముద్రగర్భ భూకంపం ధాటికి ఉద్భవించిన రాకాసి అలలు క్రూరంగా తీరపట్టణాలపై విరుచుకుపడ్డాయి. రిక్టర్‌స్కేల్‌పై 8.8 తీవ్రతతో మొదలైన భూ ప్రకంపనలు తీర దేశాల్లోని కోట్లాది మంది ప్రజలను ప్రాణభయంతో పరుగులు పెట్టించాయి. భవనాలు పేకమేడల్లా కూలుతాయన్న భయంతో ఇప్పటికే లక్షలాది మంది తీరప్రాంత వాసులు సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఆగకుండా ప్రకంపనలు ఉధృతస్థాయిలో రావడంతో భవనాలు కొన్ని నిమిషాలపాటు ఊగిపోయాయి. తీర ప్రాంతాల్లోకి సముద్రపునీరు ఊహించనంతగా కొట్టుకొచ్చింది. రష్యా తూర్పున సుదూరంగా ఉన్న కామ్‌చట్కా ద్వీపకల్పంలోని పెట్రోపావ్లోవ్స్క్%-%కామ్చాట్స్కీ నగర సమీపంలో ఈ భూకంపం సంభవించింది.
స్థానిక కాలమానం ప్రకారం రష్యాలో బుధవారం ఉదయం 11.24 గంటలకు పసిఫిక్ మహాసముద్రగర్భంలో 21 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించామని అమెరికా జియాలజికల్ సర్వే సంస్థ ప్రకటించింది. కామ్‌చట్కా పరిధిలో కొన్ని చోట్ల అలలు ఏకంగా 20 అడుగుల ఎత్తులో దూసుకొచ్చి తీరంలో పెను విలయం సృష్టించాయని రష్యా సోషనాలజీ ఇన్‌స్టిట్యూట్ ప్రకటించింది. సివిరో కురిల్స్క్ తీరపట్టణంపై 14 అడుగుల ఎత్తైన రాకాసి అలలు విరుచుకుపడ్డాయి. తీరంలోని నిర్మాణాలను సర్వనాశనం చేశాయి. రష్యా మొదలు జపాన్, అమెరికా, హవాయి, న్యూజిలాండ్, చిలీ, కొలంబియా దాకా సమీపంలోని అన్ని దేశాలను సునామీ ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఆయా దేశాల ప్రభుత్వాలు ఇచ్చిన సునామీ హెచ్చరికలతో తీరప్రాంతాల్లోని ప్రజలంతా ప్రాణభయంతో ఎత్తైన ప్రదేశాలు, బీచ్‌లకు దూరంగా ఉన్న పచ్చికబయళ్లకు పరుగులు తీశారు. ప్రకంపనలకు తాము ఉంటున్న భవనాలు ఊగిపోవడంతో కొందరు భయంతో కిటికీల నుంచి బయటకు దూకి గాయాలపాలయ్యారు.
అమెరికాలోని హొనలూనూ సిటీలో జనం ఒక్కసారిగా కార్లతో వేరే చోట్లకు తరలిపోవడంతో రహదారులన్నీ ట్రాఫిక్‌తో స్తంభించిపోయాయి. ద్వీప రాష్ట్రం హవాయిలో పలుచోట్ల సునామీ సైరన్లు మోగించారు. భూ ప్రకంపనలు జపాన్ తీరాలను తాకినా ఆ దేశంలోని అణువిద్యుత్ కేంద్రాలకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదని అంతర్జాతీయ అణుఇంధన సంస్థ స్పష్టంచేసింది. సాధారణంగా భూకంపం తర్వాత వచ్చే ప్రకంపనల తీవ్రత అత్యల్పంగా ఉంటుంది. కానీబుధవారం సంభవించిన పెను భూకంపం ధాటికి ఆ తర్వాత వచ్చే ప్రకంపనలు సైతం 6.9 తీవ్రతతో విస్తరించడం గమనార్హం. సునామీ తర్వాత పలు దేశాల బీచ్‌లు నిర్మానుష్యంగా మారాయి.

**బద్దలైన అగ్నిపర్వతం**

భూకంపం సంభవించినప్పుడే రష్యాలోని కామ్‌చట్కా పరిధిలోని కిచెవ్‌స్కయా సోప్రా అగ్నిపర్వతం బద్దలైంది. ఉత్తరార్థ గోళంలోనే అతిపెద్ద అగ్నిపర్వతాల్లో ఒకటైన ఈ అగ్నిపర్వతం బద్దలవడంతో అందులోంచి భారీ స్థాయిలో లావా ఎగజిమ్మింది. పలు పేలుళ్లు సైతం వినిపించాయని రష్యా అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లోని జియోఫిజికల్ విభాగం ప్రకటించింది. పలు దేశాల్లో ప్రకంపనలు తీవ్రస్థాయిలో సంభవించినప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. కొన్ని దేశాలు అత్యధిక స్థాయి సునామీ హెచ్చరికలు జారీచేసి తర్వాత పెనుప్రమాదం లేదని తెలిశాక ఉపసంహరించుకున్నాయి.

**అయినా సర్జరీ ఆగలేదు...**

రష్యాలోని కామ్‌చట్కా ప్రాంతంలో భూకంపం వచ్చినప్పుడే అక్కడి ఒక ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో శస్త్ర చికిత్స జరుగుతోంది. కాళ్ల కింద నేల కదులుతున్నా వైద్యులు ఏమాత్రం జంకకుండా జాగ్రత్తగా సర్జరీ విజయవంతంగా పూర్తిచేశారు. సంబంధింత వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఆపరేషన్ థియేటర్‌లోని రోగి పడుకున్న స్ట్రెచర్‌ను సహాయక సిబ్బంది గట్టిగా పట్టుకోవడం, వైద్యులు సర్జరీని కొనసాగించడం ఆ వీడియోలో రికార్డయింది. దీంతో ఆపత్కాలంలోనూ వైద్యులు చూపిన వృత్తి నిబద్ధతను మెచ్చుకుంటూ పలువురు సామాజికమాధ్యమాల్లో కామెంట్లు పెట్టారు.

### 1900 ఏడాది నుంచి సంభవించిన భారీ భూకంపాలు

- 1960 చిలీ దేశంలోని బియబియో (రిక్టర్ స్కేల్‌పై 9.5 తీవ్రత)
- 1964 అమెరికాలోని అలాస్కా(రిక్టర్ స్కేల్‌పై 9.2 తీవ్రత)
- 2011 జపాన్‌లోని తొహొకూ (రిక్టర్ స్కేల్‌పై 9.1 తీవ్రత)
- 2004 ఇండోనేసియాలోని సుమత్రా (రిక్టర్ స్కేల్‌పై 9.1 తీవ్రత)
- 1952 రష్యాలోని కామ్‌చట్కా (రిక్టర్ స్కేల్‌పై 9 తీవ్రత)
- 2025 రష్యాలోని కామ్‌చట్కా (రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రత)
- 2010 చిలీలోని బియోబియో (రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రత)
- 1906 ఈక్వెడార్‌లోని ఎస్మిరాల్డాస్ (రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రత)
- 1965 అమెరికాలోని అలాస్కా (రిక్టర్ స్కేల్‌పై 8.7 తీవ్రత)
- 2012 ఇండోనేసియాలోని సుమత్రా (రిక్టర్ స్కేల్‌పై 8.6 తీవ్రత)



# ఫామ్ హౌస్ లో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు మంత్రాంగం

**హైదరాబాద్ :** ప్రస్తుతం రాష్ట్రంలో వేడి వేడిగా జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఫామ్ హౌస్ లో కేసీఆర్ తో కేటీఆర్, హరీష్ రావు కీలక భేటీ ప్రాధాన్యత సంతరించు కుంది. తాజా రాజకీయ పరిణామాలపై వీరిమధ్య సుదీర్ఘమైన చర్చ జరుగుతున్నట్లు తెలిసింది. ప్రధానంగా మూడు అంశాలతో పాటు మరికొన్ని అంశాలపై వీరు సుదీర్ఘంగా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.బీసీ రిజర్వేషన్ కు సంబంధించి పార్టీ ఒక స్పష్టమైన విధానం అవలంభించాలని, వీటికి సంబంధించి ఇదివరకే అన్ని పార్టీలు తమ అనుకూలతను స్పష్టం చేశాయి. బీఆర్ఎస్ మాత్రం రిజర్వేషన్ బిల్లును శాసనసభలో మద్దతు పలికినా, ఒకవేళ బిల్లుకు రాష్ట్రపతి, ఆర్డినెన్స్ పై గవర్నర్ ఆమోదం ముద్ర వేయకున్నా, పార్టీ పరంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు సీట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ ప్రకటించిన నేపథ్యంలో, పార్టీ కూడా అదే విధానం అవలంభించకుంటే పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందనే విషయమై చేర్చినట్లు తెలుస్తోంది.అలాగే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉన్నందున, ఈ ఎన్నికలకు ఏవిధంగా శ్రేణులను సమాయత్తం చేయాలనే విషయంపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. కవితను జైలు నుంచి విడిపించేందుకు అవసరమైతే పార్టీని, బీజేపీలో విలీనం చేయాలని అనుకున్నట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని ఎలా తిప్పికొట్టడం అనే అంశం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.తెలంగాణ జాగృతి కార్యక్రమాలతో కవిత దూకుడు ప్రదర్శిస్తున్న ఈ తరుణంలో పార్టీ ఏవిధంగా వ్యవహరించడం, కవిత కార్యకలాపాలతో పార్టీకి ఎంతవరకు లాభం, నష్టం అనే విషయాలపై కూడా చర్చ జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కొన్ని విషయాలపై కవిత పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్న తీరు కూడా పార్టీలో చర్చ జరుతున్న సందర్భంగా కేసీఆర్ ఏవిధంగా స్పందించి నిర్ణయాలు తీసుకుంటారో ఈ భేటీలో నిర్ణయం జరుగుతుందని భావిస్తున్నారు.స్థానిక ఎన్నికలకు సంబంధించి కార్యాచరణ రూపొందించేందుకు వీలుగా త్వరలో పార్టీ ప్రధాన నాయకులతో పాటు మండల, జిల్లా స్థాయి నాయకులతో ఒక సమావేశం త్వరలో ఏర్పాటు చేసి, ఎన్నికల సందర్భంగా పార్టీ శ్రేణులకు కేసీఆర్ దశదిశా నిర్దేశం చేసేందుకు తెలంగాణ భవన్ లో ఒక విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చెయ్యాలనే తలంపుతో ఉన్నట్లు తెలిసింది.



# పార్క్‌ను కాపాడిన హైడ్రా

**హైదరాబాద్ :** తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన హైడ్రా వ్యవస్థకు విశేష స్పందన లభిస్తోంది. హైదరాబాద్ మూసాపేటలో ఆక్రమణకు గురైన 2 వేల గజాల పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యాసిన్ అనే వ్యక్తి టెంట్ సామాన్ల దుకాణం పేరుతో పార్కు స్థలాన్ని ఆక్రమించి వ్యాపారం చేస్తుండగా, ఫిర్యాదుల మేరకు హైడ్రా స్పందించి ఆక్రమణలను తొలగించింది. స్థానికులు పార్కును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.తెలంగాణలో రేవంత్ సర్కార్ తీసుకువచ్చిన హైడ్రా పని తీరుపై ఎక్కడ చూసినా ప్రశంసల వర్షం కురుస్తోంది. హైడ్రా వచ్చిన తర్వత.. తెలంగాణ రాజధాని హైదరాబాద్ లో అక్రమ నిర్మాణాలు చేపట్టేవారు.. ఆక్రమణలకు పాల్పడుతున్న వారు భయంతో ఒణికిపోతున్నారు. ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడం ఆలస్యం.. వెంటనే రంగంలోకి దిగి.. ఫిర్యాదు అందిన ప్రాంతానికి వెళ్లి పరిశీలిస్తోంది. అక్రమాలకు పాల్పడుతున్నట్లు నిర్ధారణ అయితే చాలు.. వెంటనే వారి భరతం పడుతోంది. ప్రభుత్వ స్థలాలు, ఆస్తులన పరిరక్షణతో పాటుగా నగరంలోని చెరువుల పరిరక్షణ బాధ్యత కూడా హైడ్రా మీదనే ఉంది. ఈక్రమంలో తాజాగా హైడ్రా మూసాపేటలో 2 వేల గజాల పార్కు స్థలాన్ని అక్రమార్కుల చెర నుంచి కాపాడి.. అందరి ప్రశంసలు పొందుతుంది. ఆ వివరాలు..అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై కొరడా ఝుళిపిస్తోన్న హైడ్రా.. తాజాగా మంగళవారం నాడు.. హైదరాబాద్‌లోని మూసాపేట, ఆంజనేయనగర్‌లో ఉన్న ఆక్రమణలు తొలగించింది. యాసిన్ అనే వ్యక్తి పార్కు స్థలంపై కన్ను వేసి దాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేయసాగాడు. ఈక్రమంలో యాసిన్ రోడ్డుకు ఒకవైపు టెంట్ సామాన్ల దుకాణం నిర్వహించసాగాడు. ఇక దుకాణానికి ఎదురుగా ఉన్న 2 వేల గజాల పార్కు స్థలంలో టెంట్ సామాన్లు, సౌండ్ సిస్టమ్ మెటీరియల్, జనరేటర్ల రిపేరింగ్ తదితర వ్యాపార కార్యక్రమాలకు వినియోగించేవాడు. దీని గురించి గతంలో జీహెచ్ఎంసీ, పోలీసులకు ఫిర్యాదు చేసిన లాభం లేకపోయింది.ఈక్రమంలో హైడ్రా వ్యవస్థ ఏర్పాటు అయిన తర్వాత.. పార్కు స్థలం ఆక్రమణ గురించి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా బృందం.. ఘటనా స్థలాన్ని పరిశీలించించింది. హుడా లేఔట్ ప్రకారం రెండు వేల గజాలను పార్కు కోసం కేటాయించిన స్థలంగా హైడ్రా అధికారులు నిర్ధారించారు. కబ్జా చేసి నిర్మించిన టెంట్ హౌజ్‌ను హైడ్రా అధికారులు మంగళవారం నాడు కూల్చి వేశారు.గతంలో ఈ పార్కు అభివృద్ధికి రూ.50 లక్షలు విడుదల చేసింది జీహెచ్ఎంసీ. ఈ మొత్తంతో పార్కు చుట్టూ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వచ్చిన వారిని కబ్జాదారులు అడ్డుకున్నారు. ఈక్రమంలో స్థానికులు ఇటీవల పార్కు కబ్జా గురించి హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా దీని మీద విచారణ చేసి కబ్జాలు తొలగించింది. ఇనుప తీగతో ఫెన్సింగ్ వేసింది. ఈక్రమంలో లే ఔట్ ప్రకారం పార్కును అభివృద్ధి చేయాలంటూ స్థానికుల డిమాండ్ చేస్తున్నారు.



## మాపై తోస్తే ఎట్లా

-మొదటిపేజీ తరువాయి

అని చెప్పారు. అయితే భద్రాద్రి జిల్లా వాసుల మనోభావాలను గుర్తించి ఏపీలోకి వెళ్లిన ఆ ఐదు పంచాయతీలను వెనక్కి తీసుకొచ్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని, ఈ విషయాన్ని పార్టీ పరంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. బుధవారం కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో సీతారామచంద్రస్వామిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం అక్కడ, ఇల్లెందు, పాల్వంచల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో అ?ధికారంలో ఉన్న పార్టీగానీ, ప్రస్తుత ప్రభుత్వం గానీ భద్రాద్రి ఆలయ అభివృద్ధికి కృషి చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వమే రామాలయ అభివృద్ధికి ప్రసాద్ పథకంలో భాగంగా రూ.98 కోట్లు కేటాయించిందని, తొలి విడతలో రూ.43 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే రీతిలో రామాలయాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. హిందూ ఆలయాలు, సంస్థలపై ఇటీవల దాడులు జరుగుతున్నాయని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రభుత్వం మాట్లాడేందుకు కూడా సాహసించడం లేదని.. ఇది మంచిపద్ధతి కాదని విమర్శించారు. ఏపీలోని పురుషోత్తపట్నంలో భద్రాద్రి ఆలయ భూముల ఆక్రమణను అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపై దాడి జరిగితే తొలుత తానే స్పందించానన్నారు. బీసీలకు 42్ఘ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ డ్రామాలాడుతోందని, గతంలో బీసీలకు 50% రిజర్వేషన్లు ఇస్తామని బీఆర్ఎస్ చెప్పిందని.. ఈ రెండు పార్టీలు బీసీలను మోసగించాయని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ పేరుతో ముస్లింలకు 10్ఘ రిజర్వేషన్ ఇవ్వాలనే ప్రతిపాదనను బీజేపీ వ్యతిరేకిస్తోందని, కాంగ్రెసలోనే కొం తమంది అగ్రనాయకులు ఈ బీసీ రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో కాంగ్రెస్ నేతలు మాట్లాడిన తీరు పాకిస్థాన్ కు మద్దతు పలుకుతున్నట్లుగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో 19నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని బీజేపీపట్ల సామాన్య ప్రజలు, మేధావులు కూడా అకర్షితులవుతున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఉచితాల కోసం కొత్త డిస్కమ్

-మొదటిపేజీ తరువాయి

తగ్గించుకునేందుకు వీలుగా రీస్ట్రక్చరింగ్‌కు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించా రు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీలు హరీశ్, కృష్ణభాస్కర్.. డిస్కమ్‌ల సీఎండీలు ముషారఫ్, వరుణ్‌రెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం, రెడ్‌కో ఎండీ అనిల తదితరులతో సీఎం సమీక్ష జరిపారు.

**అధిక వడ్డీ రుణాలతో డిస్కమ్‌లు డీలా..**

విద్యుత్ రంగంలో సంస్కరణలు తప్పనిసరి అని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యుత్ విభాగాన్ని ప్రక్షాళన చేసేందుకు అవసరమైన సంస్కరణలు అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందులో భాగంగానే ప్రస్తుతమున్న సదరన్, నార్తర్న్ డిస్కమ్‌లకు అదనంగా మరో డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్త డిస్కమ్ పరిధిలోకి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాలన్నీ తీసుకు రావడం వల్ల ప్రస్తుతం ఉన్న డిస్కమ్‌ల పనితీరు మెరుగుపడుతుందని వివరించారు. డిస్కమ్‌ల పునర్వ్యవస్థీకరణతో వాటిపై ఉన్న రుణ భారం కూడా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. పది శాతం వడ్డీతో తీసుకున్న రుణాలతో డిస్కమ్‌లు డీలా పడ్డాయని అన్నారు.

**స్కూళ్లు, సర్కారు కార్యాలయాలకు సౌర విద్యుత్**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ వినియోగాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. జిల్లాల వారీగా అనువైన భవనాలను గుర్తించే బాధ్యతను ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగించాలన్నారు. రాష్ట్ర సచివాలయానికి కూడా సౌర విద్యుత్ అందించాలని, వెంటనే ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎండాకాలంలో సచివాలయంలో వాహనాల పార్కింగ్ ఇబ్బందిగా మారిన నేపథ్యంలో సోలార్ రూఫ్ టాప్ షెడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

**2.10 లక్షల మంది ఎస్టీ రైతులకు లబ్ధి చేకూర్చాలి**

ఇందిర సోలార్ గిరి జల వికాసం పథకం రాష్ట్రంలోని అన్ని గిరిజన, ఆదివాసీ తండాలు, ఏజెన్సీ ఏరియాల్లో యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మూడేళ్లలో 2.10 లక్షల మంది ఎస్టీ రైతులకు ఈ పథకం వర్తింపజేయాలని, 6 లక్షల ఎకరాలకు సౌర విద్యుత్ పంపుసెట్లను అందించాలని చెప్పారు.

## పోరుబాటలో పార్టీ సైతం



-మొదటిపేజీ తరువాయి

ప్రత్యేక రైలు ఈనెల ఆరో తేదీ ఉదయం కల్లా ఢిల్లీ చేరుకునేలా సమన్వయం చేయనుంది. ఢిల్లీలో పోరాటం నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టనున్న జనహిత పాదయాత్ర షెడ్యూల్‌ను కుదించారు. వాస్తవానికి ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల ఆరో తేదీ వరకు ఆరు ఉమ్మడి జిల్లాల్లోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో జరగాల్సిన ఈ పాదయాత్రను వచ్చే నెల నాలుగో తేదీకి కుదించారు. నాలుగో తేదీ సాయంత్రం పాదయాత్ర ముగిసిన వెంటనే ముఖ్య నేతలు ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులతో పాటు ముఖ్య నాయకత్వమంతా ఢిల్లీలోనే ఉండి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో భాగస్వాములు కావాలని పీసీసీ పిలుపునిచ్చింది.

**త్వరలో కార్పొరేషన్ డైరెక్టర్లు, బోర్డు సభ్యుల ప్రకటన**

పార్టీ సంస్థాగత నిర్మాణం, పాదయాత్ర, ఢిల్లీ టూర్, నామినేటెడ్ పదవులపై చర్చించేందుకు కాంగ్రెస్ కీలక నేతలు బుధవారం సమావేశమయ్యారు. సీఎం నివాసంలో గంటన్నర పాటు జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ పాల్గొన్నారు. వీలైనంత త్వరగా పార్టీ కమిటీల ఏర్పాటుపై చర్చించారు. నామినేటెడ్ పదవుల కోసం జిల్లా ఇన్‌చార్జుల నుంచి వచ్చిన జాబితాలను మీనాక్షి, మహేశ్‌గౌడ్‌లు ముఖ్యమంత్రికి అందజేశారు. ఆయన వీటిని పరిశీలించి తుది జాబితాను ఖరారు చేస్తారని, వారం, పది రోజుల్లో కార్పొరేషన్ డైరెక్టర్లు, బోర్డు సభ్యులను అధికారికంగా ప్రకటిస్తారని తెలుస్తోంది. ఇక ఢిల్లీ వేదికగా ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న బీసీ రిజర్వేషన్ల పోరాట ప్రణాళికను కూడా ఈ సమావేశంలో ఖరారు చేశారు. ఈ నెల ఐదో తేదీన పార్లమెంటు ఉభయసభల్లో ఈ అంశం చర్చకు వచ్చేలా వాయిదా తీర్మానం కోసం పార్టీ తరఫున పట్టు పట్టాలని, ఆరో తేదీన జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయాలని, ఏడో తేదీన రాష్ట్రపతిని కలవాలని నిర్ణయించారు.

# నింగిలోకి నైసార్

సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికాకు చెందిన నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) ఉమ్మడి ఉపగ్రహం నైసార్ జీఎస్ఎల్వీ ఎఫ్16 నిప్పులు చిమ్ముతూ బుధవారం నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత కక్ష్యలోకి చేరుకున్న తర్వాత భూమిని స్కాన్ చేయడం ప్రారంభించడంతో ప్రయోగం విజయవంతమైంది. భూమి ఉపరితలం లోతు గా పరిశీలన.. వాతావరణ మార్పులపై అధ్యయనం లాంటి విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఇస్రో, నాసాలు మొట్ట మొదటిసారిగా సంయుక్తంగా 2,392 కేజీల బరువు కలిగిన నైసార్ (నాసా%–%ఇస్రో సింథటిక్ ఆపార్చర్ రాడార్) ఉపగ్రహాన్ని రూపొందించాయి. జియో సింక్రనస్ లాంచింగ్ వెహికల్ (జీఎస్ఎల్వీ ఎఫ్16) ఉపగ్రహ వాహక నౌక ద్వారా భూమికి 743 కిలోమీటర్ల ఎత్తులోని సూర్య సమకాలిక కక్ష్యలో నైసార్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఇది ప్రత్యేకంగా భూమి ఉపరితల పరిశీలన ఉపగ్రహం కావడం విశేషం. డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ ఆపార్చర్ రాడార్ (నాసాది ఎల్%–%బ్యాండ్, ఇస్రోది ఎస్%–%బ్యాండ్) భూమిని అత్యంత దగ్గరగా పరిశీలించే ఉపగ్రహం.

దీనికి 12 మీటర్ల అన్ఫర్లబుల్ మెష్ రిఫ్లెక్టర్ యాంటెన్నాను అమర్చారు. ఈ ఉపగ్రహం తొలిసారిగా స్వీప్సార్ టెక్నాలజీని ఉపయోగించి 242 కిలోమీటర్ల అధిక స్పేషియల్ రిజల్యూషన్తో భూమిని పరిశీలిస్తుంది. ఈ ఉపగ్రహం భూగోళాన్ని మొత్తం స్కాన్ చేసి 12 రోజుల వ్యవధిలో అన్ని వాతావరణ పరిస్థితుల్లో పగలు, రాత్రి తేడా లేకుండా డేటాను అందిస్తుంది. భూమి ఉపరితలంలో నేల వైకల్యం, మంచు పలకాల కదలిక, వృక్ష సంపద, డైనమిక్స్ వంటి చిన్న మార్పులను కూడా గుర్తిస్తుంది. సముద్రపు మంచు వర్గీకరణ, ఓడల గుర్తింపు, తీర ప్రాంత పర్యవేక్షణ, తుపాన్ లక్షణం, నేల తేమలో మార్పులు, ఉపరితల నీటి వనరుల మ్యాపింగ్, పర్యవేక్షణతో పాటు విపత్తుల సమయంలో హెచ్చరికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తుంది. రూ.11,200 కోట్లతో రూపొందించిన ఈ ఉపగ్రహం పదేళ్లపాటు సేవలు అందిస్తుంది.

**ప్రయోగంలో అన్ని దశలు అద్భుతం**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్లోని రెండో ప్రయోగ వేదిక నుంచి బుధవారం సాయంత్రం 5.40 గంటలకు జీఎస్ఎల్వీ%–%ఎఫ్16 ప్రయోగాన్ని నిర్వహించారు. ఎరుపు, నారింజ రంగుతో నిప్పులు చిమ్ముతూ నింగివైపునకు అత్యంత వేగంగా దూసుకెళ్లింది. మూడు దశల్లో ప్రయోగించిన రాకెట్లో అన్ని దశలు అద్భుతంగా పని చేయడంతో 18.40 నిమిషాలకు కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టారు. బెంగళూరు సమీపంలో హాసన్లో ఉన్న గ్రౌండ్స్టేషన్కు సిగ్నల్స్ అందడంతో ఉపగ్రహం చక్కగా పని చేస్తోందని వారు ప్రకటించారు. ఇది షార్ నుంచి 102వ ప్రయోగం. ప్రయోగం విజయవంతం కావడంతో మిషన్ కంట్రోల్ రూంలో శాస్త్రవేత్తలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని హర్షం వ్యక్తం చేశారు.

**ప్రయోగం జరిగింది ఇలా..**

51.70 మీటర్ల పొడవున్న జీఎస్ఎల్వీ ఎఫ్16 రాకెట్ 420.5 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి పయనమైంది. నాలుగు స్ట్రాపాన్ బూస్టర్ల సాయంతో మొదటిదశ ప్రారంభమైంది. ఒక్కో స్ట్రాపాన్



బూస్టర్లో 40 టన్నుల ద్రవ ఇంధనం.. స్ట్రాపాన్ బూస్టర్లకు మధ్యలోని కోర్ అలోన్ దశలో 139 టన్నుల ఘన ఇంధనాలను (మొత్తం 299 టన్నుల ద్రవ, ఘన ఇంధనాలు) మిళితం చేసి 152 సెకన్లలో మొదటి దశ పూర్తి చేశారు. రాకెట్ శిఖర భాగంలోని ఉప గ్రహానికి అమర్చిన హీట్ షీల్డ్ 171.8 సెకన్లకు మొదటి %–% రెండో దశకు మధ్యలోనే విజయవంతంగా విడిపోయాయి. రెండో దశను 294.1 సెకన్లకు పూర్తి చేశారు. ఆ తర్వాత అత్యంత కీలకమైన క్రయోజనిక్ దశలో 15 టన్నుల క్రయోజనిక్ ఇంధనం సాయంతో 1,100 సెకన్లకు మూడో దశను కటాఫ్ చేశారు. అనంతరం 1,120 సెకన్లకు (18.40 నిమిషాలకు) 98.40 డిగ్రీల వంపుతో భూమికి 743 కిలోమీటర్ల ఎత్తులోని సూర్య%–%సమకాలిక కక్ష్యలోకి నిసార్ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు. అక్కడి నుంచి ఉపగ్రహాన్ని బెంగళూరుకు సమీపంలోని హసన్లో ఉన్న మాస్టర్ కంట్రోల్ సెంటర్ తన ఆధీనంలోకి తీసుకుని ఉపగ్రహ పనితీరును పర్యవేక్షించడం ప్రారంభించింది. ఉపగ్రహం సంతృప్తికరంగా ఉందని ప్రకటించారు.

**ఇక భారీ ప్రయోగాలే లక్ష్యం**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఇక ఆకాశమే హద్దుగా భారీ ప్రయోగాలే లక్ష్యంగా పని చేస్తుందని ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ నారాయణన్ అన్నారు. బుధవారం సాయంత్రం నిసార్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టిన అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఆయన మాట్లాడారు. ఈ ఏడాది మే నెల 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ సీ61 ప్రయోగం అపజయం కొంత కుంగదీసినా, ఈ ప్రయోగ విజయంతో మరిన్ని ప్రయోగాలను విజయవంతం చేయగలమనే నమ్మకం వచ్చిందన్నారు. ఈ ప్రయోగం తనకు తొలి విజయమని, ఇస్రో బృందానికి అభినందనలు తెలియజేశారు.

ఇది ఇస్రో సాధించిన సమష్టి విజయమని చెప్పారు. ఇస్రో%–%నాసా మధ్య కుదిరిన ఒప్పందంతోనే ఇరు దేశాలకు చెందిన అంతరిక్ష సంస్థలు మొట్టమొదటిసారి చేసిన ప్రయోగం విజయంతం కావడం ఆనందంగా ఉందన్నారు. నాసాతో మరిన్ని ఒప్పందాలు చేసుకుని రాబోయే రోజుల్లో మరో మూడు ప్రయోగాలను నిర్వహించేందుకు నాసా%–%ఇస్రో సన్నద్ధమవుతున్నాయని తెలిపారు. ఇస్రోకు వాణిజ్య సంస్థగా ఉన్న న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్కు పీఎస్ఎల్వీ రాకెట్ను అప్పగించడంతో ఈ ఏడాది ప్రయివేట్గా పీఎస్ఎల్వీ%–%ఎన్1 పేరుతో నూతన ప్రయోగాన్ని చేపట్టనున్నామని తెలిపారు. ఈ ఏడాది ఇస్రో నిర్ణయించిన షెడ్యూల్లో నిసార్తో కలిపి ఏడు ప్రయోగాలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఎల్వీఎం3%–%ఎం5 రాకెట్ ద్వారా వాణిజ్యపరంగా బ్లూబర్డ్%–%6 అనే ఉపగ్రహ ప్రయోగం వుంటుందన్నారు. ఆ తర్వాత పీఎస్ఎల్వీ ఎన్1 రాకెట్ ద్వారా టీడీఎస్%–%1 అనే ఉపగ్రహాన్ని, హెచ్ఎల్వీఎం (గగన్యాన్%–%1) ద్వారా అన్ క్రూయిడ్ అర్బిటల్ టెస్ట్ పైలట్%–%1, జీఎస్ఎల్వీ ఎఫ్17 ద్వారా ఐడీఆర్ఎస్ఎస్%–%1 అనే ఉపగ్రహాన్ని, గగన్యాన్ టీవీ%–%డీ2 ద్వారా టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్%–%2 అనే ప్రయోగాత్మక ప్రయోగంతో పాటు పీఎస్ఎల్వీ సీ62 ద్వారా ఓషన్శాట్%–%3జీ అనే ఉపగ్రహాలను ప్రయోగించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. అనంతరం 2026లో వరుసగా గగన్యాన్%–%2, గగన్యాన్%–%3 ప్రయోగాలే లక్ష్యంగా పెట్టుకున్నామని, చంద్రయాన్%–%4 ప్రయోగానికి సంబంధించిన పనులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. కాగా, నిసార్ ప్రయోగాన్ని ఇస్రో, నాసా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఇస్రో మాజీ చైర్మన్లు డాక్టర్ కే రాధాకష్ణన్, ఏఎస్ కిరణ్కుమార్లు మిషన్ కంట్రోల్ సెంటర్లోని గ్యాలరీ నుంచి వీక్షించారు.

**ఇస్రో సహకారం మరువలేనిది**

నిసార్ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ%–%ఎఫ్16 రాకెట్ విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తీరు ఆమోఘం. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో).. నాసా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, జేపీఎస్ ఇంజినీర్ల పట్ల చూపించిన సహకారం మరువలేనిది. నాసా%–%ఇస్రో సింథటిక్ ఆపార్చర్ రాడార్ ఉపగ్రహాన్ని (నిసార్) ఇరుదేశాలకు చెందిన ఇంజినీర్లు, నాసా శాస్త్రవేత్తలు కలిసికట్టుగా చేయడం ఆనందంగా ఉంది. ఇస్రో చూపించిన అభిమానం, సహకారంతో భవిష్యత్తులో మరో రెండు మూడు ప్రయోగాలు చేయడానికి మేము ముందుకొస్తున్నాం. ఈ ప్రయోగంలో పాలు పంచుకున్న ఇస్రో శాస్త్రవేత్తలకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు.

## కాంగ్రెస్ ధారాదత్తం చేసింది

న్యూఢిల్లీ

ఆపరేషన్ సిందూర్పై రాజ్యసభలో 16 గంటల చర్చకు ప్రభుత్వం తరఫున సమాధానంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ కాంగ్రెస్పై విమర్శలు గుప్పించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ పాపం కాంగ్రెస్దే అని ధ్వజమెత్తారు. " దేశ భద్రత అనేది కాంగ్రెస్ ప్రాధాన్యతాంశాల్లో అస్సలు లేదు. ఓటు బ్యాంక్, బుజ్జగింపు రాజకీయాలు మాత్రమే కాంగ్రెస్ అజెండా. వీటిపై మాత్రమే కాంగ్రెస్ దృష్టిపెట్టి జాతీయభద్రత వంటి మిగతా కీలకాంశాలను గాలికొదిలేసింది. దీంతో ఉగ్రవాదం విపరీతంగా విస్తరించింది. దీనికి ఏకైక కారణం కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు, పేలవమైన రాజకీయ విధానాలు. కాంగ్రెస్ ఘోర తప్పిదాల కారణంగానే కశ్మీర్లో కొంతభాగం మన చేజారింది. అలా కాంగ్రెస్సే పాకిస్తాన్కు పీఓకేను అప్పగించింది. వాళ్లు ఇచ్చిన పీఓకేను మేం తిరిగి తీసుకొస్తాం. ఘటన జరిగాక సమీక్ష జరపడం కాంగ్రెస్ విధానం. అసలు అలాంటివి సంభవించకుండా ముందే అప్రమత్తంగా ఉండటం మా నైజం" అని అమిత్ షా అన్నారు. "పహల్గాం పాశవిక హత్యాకాండలో అమాయకులు చనిపోయారు. వాళ్ల తలకు గురిపెట్టి మరీ ఉగ్రవాదులు తూటాలు పేల్చారు. అదే తీరులో ఆపరేషన్ మహాదేవ్లో పహల్గాం ఉగ్రవాదుల తలల్లోకి మేం కూడా తూటాలు దించాం. పహల్గాం బాధిత కుటుంబాలు కోరుకున్నది మేం నెరవేర్చాం. ఆపరేషన్ మహదేవ్లో అంతమైన ముగ్గురు ఉగ్రవాదులకు లష్కరే తోయిబాతో సంబంధాలున్నట్లు ఆర్మీ దర్యాప్తులో స్పష్టమైంది. మహిళలు, చిన్నారుల ఎదుట నీ మతమేంటి? అని అడిగిమరీ అమాయకుల ప్రాణాలు తీసిన పహల్గాం వంటి హేయమైన ఘటన గతంలో ఎన్నడూ జరగలేదు" అని అమిత్ షా అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్వయంగా వచ్చి మాట్లాడాలని విపక్షసభ్యులు పట్టుబట్టారు. ఆయన బదులు నేను మాట్లాడుతున్నానని అమిత్ షా సర్దిచెప్పే ప్రయత్నంచేసినా విపక్షసభ్యులు వినిపించుకోకుండా నిరసనగా వాకౌట్ చేశారు. తర్వాత అమిత్ షా తన ప్రసంగాన్ని కొనసాగించారు.

## ఎమ్మెల్యేల ఫిరాయింపుపై నేడు సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో సుప్రీం కోర్టు గురువారం తుది తీర్పు వెలువరించనుంది. ఈ ఫిరాయింపుల కేసుపై చివరిసారిగా ఏప్రిల్ 3న జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మసీలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇప్పుడు జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. ఈకేసుపై సీజే ధర్మాసనం కీలక తీర్పు ఇవ్వనున్న నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి పార్టీ ఫిరాయించారని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ సుప్రీం కోర్టులో జనవరి 15న స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. అదేరోజు ఎమ్మెల్యేలు పరిగి శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాద య్య, టి.ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ఎం.సంజయ్ కుమార్ పార్టీ ఫిరాయించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింత ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ రిట్ పిటిషన్ వేశారు. ఆ తర్వాత వాదనలు జరుగుతుం డగానే మార్చి 18న బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మరో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ను ప్రతివాదిగా చేర్చారు. ఆ పిటిష న్లంటినీ కలిపి విచారించిన ధర్మాసనం ఏప్రిల్ 3న తీర్పును ఎనిమిది వారాలకు రిజర్వ్ చేసింది. ధర్మాసనంలో సీజేపాటు జస్టిస్ వినోద్ చంద్రన్ ఉన్నారు.

## ఆయన చైనా గురు

లోక్సభ విపక్షనేత రాహుల్గాంధీ 'చైనా గురు' అని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ వ్యంగ్యంగా సంబోధించారు. రాహుల్ పేరు ప్రస్తావించకుండానే తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆపరేషన్ సిందూర్పై బుధవారం రాజ్యసభలో కొనసాగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. "నేను చైనా గురు కాను. అందుకే ఇటీవలి నా పర్యటనలో అక్కడ ఎవరితోనూ రహస్యంగా సమావేశం కాలేదు.. గోప్యంగా ఒప్పందాలూ కుదుర్చుకోలేదు. ఉగ్రవాదం, ఉద్రిక్తతలు, వాణిజ్యం, ఉభయదేశాలకు ఆసక్తి ఉండే ఇతర అంశాలపైనే చర్చించాను. మనదగ్గర ఒక చైనా గురు ఉన్నారు. ఆయనకు ఆ దేశంపై ఎంతో ప్రేమ. ఇరు దేశాలకు సంబంధించి ఆయనొక ఒప్పందం కుదుర్చుకున్నారు. దానిపేరు చిండియా (చైనాంఇండియా). నా చైనా పర్యటనలో కొన్ని లోటుపాట్లు ఉండవచ్చు. ఎందుకంటే నేను చైనా (బీజింగ్) ఒలింపిక్స్కు వెళ్లి ఎవరిచేతా పాఠాలు చెప్పించుకోలేదు. నన్నెవరూ దానికి పిలవలేదు. ఎందుకంటే నేను ప్రత్యేక వ్యక్తిని కాను. ఒకరు మాత్రం ఆ ఒలింపిక్స్కు వెళ్లి జ్ఞానం పొందారు. వారు అక్కడ చైనావాళ్లనే కాదు.. వేరేవారినీ కలిశారు. ఒలింపిక్స్ క్లాస్రూంలో నిద్రపోవడం వల్ల ఆయన నేర్చుకోవాల్సినవి కొన్ని మిగిలిపోయాయేమో. అందుకే చైనా రాయబారిని ఇంటికి ఆహ్వానించి మరోసారి ట్యూషన్ చెప్పించుకున్నారు. చైనావల్ల మన దేశానికి యూపీఏ పాలనలో ఏయే రూపాల్లో నష్టం వాటిల్లిందో ఆ గురు గుర్తెరగాలి" అని జైశంకర్ హితవు పలికారు. పాక్తో పోరు విరమణలో వేరే దేశం జోక్యం గానీ, వాణిజ్య సంబంధం గానీ లేదని తేల్చిచెప్పారు.

# 25 శాతం సుంకాలు



-మొదటిపేజీ తరువాయి

నిమిత్తం అమెరికా బృందం ఆగస్టు 25న భారత్ రానుంది.

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్పై అనూహ్యంగా భారీ టారిఫ్ బాంబు విసిరారు. భారత దిగుమతులపై ఏకంగా 25 శాతం సుంకాలు బాదారు. అంతేగాక వీటికి అదనంగా రష్యాతో వర్తకం చేస్తున్నందుకు భారత్పై ప్రత్యేకంగా జరిమానా కూడా విధించనున్నట్టు పేర్కొన్నారు. ఆ మొత్తం ఎంత న్నది పేర్కొనలేదు. ఈ నిర్ణయాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. తన సోషల్ మీడియా హ్యాండిల్ 'ట్రూత్ సోషల్'లో బుధవారం ఈ మేరకు ఆయన పలు పోస్టులు పెట్టారు. అమెరికాతో భారత వర్తక విధానాలు, నిబంధనలను అత్యంత దారుణమైనవిగా అభివర్ణించారు.

"భారత్ మా మిత్ర దేశమే. కానీ వర్తక, వాణిజ్య సంబంధాల విషయంలో ఆ దేశంతో అంతా సజావుగా లేదు. అమెరికాపై ప్రపంచంలోనే అత్యధిక టారిఫ్లు వసూలు చేస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. అందుకే ఆ దేశంతో మేం భారీ స్థాయిలో వ్యాపారం చేయడం లేదు"అని రాసుకొచ్చారు. భారత్తో అమెరికాకు భారీ వర్తక లోటు ఉందని గుర్తు చేశారు. రష్యా నుంచి భారీగా చమురు, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నందుకే అదనంగా జరిమానా విధిస్తున్నట్టు స్పష్టం చేశారు.

"ఉక్రెయిన్లో జనహననం ఆగాలని ప్రపంచమంతా ఆకాంక్షిస్తోంది. ఇలాంటి సమయంలో అందుకు పాల్పడుతున్న రష్యాతో భారత్ భారీ వాణిజ్య సంబంధాలు నెరుపుతోంది"అంటూ ఆక్షేపించారు.

అదే జరిగితే రష్యాతో వాణిజ్యం చేస్తున్నందుకు అమెరికా నుంచి జరిమానా ఎదుర్కోనున్న తొలి దేశం భారతే అవుతుంది. భారత్తో వర్తక ఒప్పందం నిమిత్తం అమెరికా బృందం ఆగస్టు 25 నుంచి భారత్లో పర్యటించనుందని కేంద్రం ప్రకటించిన మర్నాడే ట్రంప్ నుంచి అనూహ్యంగా సుంకాల పోటు నిర్ణయం వెలువడటం గమనార్హం. ఈ దెబ్బకు రూపాయి విలువ గత మూడేళ్లలో అత్యధికంగా బుధవారం ఏకంగా 89 పైసలు పతనమైంది. అమెరికా డిమాండ్లకు తలొగ్గేలా భారత్పై ఒత్తిడి పెంచడమే ట్రంప్ ప్రకటన ఉద్దేశమని భావిస్తున్నారు.

ఇటీవలి కాలంలో జపాన్, బ్రిటన్, యూరోపియన్ యూనియన్పై కూడా ట్రంప్ ఇలాంటి ఒత్తిళ్లే తెచ్చి అమెరికాకు అనుకూలంగా ఒప్పందాలు కుదుర్చుకుందని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. గతంలో చైనాపై కూడా ఇలాగే ట్రంప్ అడ్డగోలుగా టారిఫ్లను ప్రకటించడం, చివరికి వెనక్కు తగ్గడం తెలిసిందే. భారత చమురు దిగుమతుల్లో కేవలం 0.2 శాతంగా ఉన్న రష్యా వాటా ఉక్రెయిన్తో ఆ దేశం యుద్ధానికి దిగిన అనంతరం ఏకంగా 35 నుంచి 40 శాతానికి పెరిగింది. అయితే ఇప్పటికీ రష్యా నుంచి అతి పెద్ద చమురు దిగుమతిదారుగా చైనాయే నిలుస్తోంది. ఆ దేశంపై మాత్రం ట్రంప్ ఎలాంటి జరిమానాలు విధించలేదు. ట్రంప్ సుంకాల నిర్ణయంపై భారత పరిశ్రమల రంగం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

ట్రంప్ ప్రకటించిన 25 శాతం సుంకాలు ఇప్పటికే అన్ని దేశాలతో పాటు భారత్పైనా అమల్లో ఉన్న 10 శాతం బేస్లైన్ టారిఫ్లకు అదనమా, కాదా అన్నదానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. అన్ని దేశాలపై 10 శాతం టారిఫ్ ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి వచ్చింది. దీనికి అదనంగా స్టీల్, అల్యూమినియం దిగుమతులపై 50 శాతం, ఆటో రంగంపై 25 శాతం అదనపు సుంకాలను కూడా ట్రంప్ విధించారు. ట్రంప్ ప్రకటన వెలువడ్డ కాసేపటికే కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్తో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ భేటీ జరిపి పరిస్థితిని సమీక్షించారు.

**ఏప్రిల్లో 26 శాతం సుంకాలు**

భారత్తో వాణిజ్య ఒప్పందం ఖరారు కాలేదని మంగళవారమే ట్రంప్ మీడియాకు చెప్పడం తెలిసిందే. 25 శాతం టారిఫ్ విధించనున్నట్టు అప్పుడే ఆయన సంకేతాలిచ్చారు. 20 నుంచి 25 శాతం దాకా టారిఫ్లు విధిస్తారా అని మీడియా ప్రశ్నించగా, అలాగే భావిస్తున్నట్టు బదులిచ్చారు. గత ఏప్రిల్ 2న భారత్పై 26 శాతం టారిఫ్లను ట్రంప్ ప్రకటించారు. కొద్ది రోజులకే ఆ నిర్ణయం అమలును 90 రోజుల పాటు, అంటే జూలై 9 దాకా, అనంతరం ఆగస్టు 1 దాకా వాయిదా వేశారు. అమెరికా, భారత్ నడుమ వాణిజ్య ఒప్పందం నిమిత్తం అత్యున్నత స్థాయి బృందాల నడుమ ఇప్పటికే ఐదు రౌండ్ల పాటు చర్చలు జరిగాయి.

**అతి పెద్ద వాణిజ్య భాగస్వామి**

2021%–%25 నడుమ భారత్కు అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిలిచింది. భారత మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా 18 శాతం. అమెరికాతో భారత్కు 2022%–%23లో 27.7 బిలియన్లు, 2023%–%24లో 35.32 బిలియన్లు, 2024%–%25లో 41 బిలియన్ డాలర్ల మేరకు వాణిజ్య మిగులు నమోదైంది. 2024%–%25లో భారత్, అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 186 బిలియన్ డాలర్ల మేర నమోదైంది. వీటిలో భారత్ 86.5 బిలియన్ డాలర్ల మేర వస్తువులను ఎగుమతి చేయగా, 45.3 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను అమెరికా నుంచి దిగుమతి చేసుకుంది. సేవల రంగంలో అమెరికాకు 28.7 బిలియన్ డాలర్ల మేరకు ఎగుమతులు జరిపింది. 25.5 బిలియన్ డాలర్ల మేరకు దిగుమతులు చేసుకుంది. మొత్తమ్మీద అమెరికాతో వాణిజ్యంలో భారత్ 44.4 బిలియన్ డాలర్ల మిగులు నమోదు చేసింది. ఇది ట్రంప్కు కంటగింపుగా మారింది. అందుకే ఇలా పదేపదే టారిఫ్ల కత్తి దూస్తున్నారు. 2024లో అమెరికాకు భారత ఎగుమతుల్లో డ్రగ్ ఫార్ములాలు%–%బయోలాజికల్స్ (8.1 బిలియన్లు), టెలికాం పరికరాలు (6.5 బిలియన్లు), అరుదైన రాళ్లు (5.3 బిలియన్లు) పెట్రోలియం ఉత్పత్తులు (4.1 బిలియన్లు), వాహనాలు%–%ఆటో పరికరాలు (2.8 బిలియన్లు), బంగారం%–%ఇతర లోహాలు (3.2 బిలియన్లు) రెడీమేడ్ దుస్తులు, కాటన్ తదితరాలు (2.8 బిలియన్లు) ఇనుము, స్టీల్ ఉత్పత్తులు (2.7 బిలియన్లు) ప్రధానమైనవి. అమెరికా నుంచి దిగుమతుల్లో ప్రధానంగా చమురు (4.5 బిలియన్లు), పెట్రో ఉత్పత్తులు (3.6 బిలియన్లు), బొగ్గు, కోక్ (3.4 బిలియన్లు), వజ్రాలు (2.6 బిలియన్లు), ఎలక్ట్రిక్ యంత్రాలు (1.4 బిలియన్లు), విమాన, రాకెట్ల విడిభాగాలు (1.3 బిలియన్లు), బంగారం (1.3 బిలియన్లు) ఉన్నాయి.

**మోదీతో ట్రంప్ స్నేహానికి ఇదీ ఫలం!: విపక్షాల ధ్వజం**

భారత్పై 25 శాతం టారిఫ్ల విధింపు మోదీ ప్రభుత్వ ఘోర వైఫల్యమేనంటూ విపక్షాలు దుయ్యబట్టాయి. మోదీతో స్నేహానికి ట్రంప్ ఏ మాత్రమూ విలువ ఇవ్వడం లేదనేందుకు ఇది తాజా నిదర్శనమని ఎద్దేవా చేశాయి. మోదీపై ట్రంప్ తారీఫ్ (పొగడ్తలు), హౌడీ మోడీ వంటి నినాదాలు ఎందుకూ కొరగానివని తేలిపోయిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్లో పేర్కొన్నారు. భారత్%–%పాక్ యుద్ధాన్ని ఆపానని ట్రంప్ 30సార్లకు పైగా చెప్పుకున్నారు. పాక్ ఆర్మీ చీఫ్కు వైట్హౌస్లో ప్రత్యేక విందు ఇచ్చారు. ఐఎంఎఫ్ నుంచి భారీ ఆర్థిక సహాయ ప్యాకేజీ ఇప్పించారు. ఇన్ని చేస్తున్నా మౌనంగా భరిస్తే బహుశా ట్రంప్ నుంచి స్పెషల్ ట్రీట్మెంట్ లభిస్తుందని మోదీ ఆశపడ్డారు. కానీ అలా జరగలేదు"అన్నారు. కాంగ్రెస్ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నుంచి స్ఫూర్తి పొంది అమెరికా అధ్యక్షుని నిర్ణయాలను దీటుగా ఎదిరించాలని మోదీకి సూచించారు. టీఎంసీ, డీఎంకే, ఆర్జేడీ, వామపక్షాలు తదితరాలు కూడా మోదీ ప్రభుత్వానిది ఘోర వైఫల్యమంటూ నిందించాయి. ఇది భారత్కు తీవ్ర అవమానమని అభిప్రాయపడ్డాయి.

# సంపాదకీయం

## ధర్మస్థలలో ధర్మం లేదా

ధర్మస్థల. ఇదొక కర్ణాటక తిరుమల. కొండల్లో వెలసిన ఈ మంజునాథ స్వామి ఆలయానికి విశేషమైన చరిత్ర. అలాంటి చారిత్రక ఆధ్యాత్మిక కేంద్రంలో వరుస హత్యలు. అందునా మహిళలు, యువతులు, మైనర్ బాలికలున్నారా? ఒక సఫాయి కార్మికుడు చెబుతున్న సాక్ష్యం ద్వారా అసలేం జరుగుతోంది? ఈ మొత్తం ఉదంతం ద్వారా వెలుగులోకి వస్తోన్న కఠిన వాస్తవాలేంటి?1995- 2014 మధ్య కాలంలో.. తాను తన చేతుల మీదుగా కొన్ని వందలాది శవాలను నేత్రావతీ పరిసర ప్రాంతాల్లో ఖననం చేశానని అంటాడు. ఈ పక్కనే ఉన్న అడవుల్లో కొన్ని మృతదేహాలను దహనం కూడా చేశాననీ చెప్పుకొచ్చాడు. మరి కొన్ని మృతదేహాలను తాను నదిలో పాడేశానని అనడం విన్న పోలీసులకు మొదట అర్థం కాలేదు. బెళ్తంగడి న్యాయస్థానంలో కూడా వాంగ్మూలం ఇచ్చాడు. దీంతో ఒక్కసారిగా ఈ వార్త రాష్ట్ర వ్యాప్త సంచలనంగా మారింది. సీఎంని కలిసిన సుప్రీం రిటైర్డ్ జడ్జ్. ఇతడిచ్చిన వాంగ్మూలంతో ఒక యూట్యూబర్ వీడియో రూపొందించడంతో.. అది అర మిలియన్ వ్యూస్ పోయింది. దీనిపైనా కేసు బుక్ అయ్యింది. ఆ సరికే అది జనబాహుళ్యంలోకి విస్తృతంగా వెళ్లడంతో.. ఈ కేసు, దాని వివరాలు తీవ్ర ప్రకంపనలు నమోదు చేయడం మొదలైంది. అదెలాగంటే సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి గోపాల గౌడ సీఎం సిద్ధరామయ్యను కలసి.. ఈ కేసు దర్యాప్తు ముమ్మరం చేయాలని కోరారు. ఇందులో మహిళలు, యువతులు, మైనర్ బాలికలు సైతం ఉండటం గుర్తించిన కర్ణాటక మహిళా కమిషన్ సైతం ప్రభుత్వాన్ని దర్యాప్తు పై ఒత్తిడి చేసింది. ఆలయ ధర్మకర్తలు జైన్లు, శివుడికి వైష్ణవ పూజలు జరిగే ధర్మస్తల. ఈ మాజీ సఫాయి కార్మికుడు చెప్పినదంతా ఎలా నమ్మాలి? కొన్నేళ్ల తరబడి ఎంతో నిష్టాగరిష్టతలతో తులతూగుతున్న ఆలయ ప్రాంతానికి ఇంతటి అప్రదిష్ట మూటగట్టడమా? దానికి తోడు ఈ ఆలయ ప్రాంతం పేరే దర్మస్థల. ఇక్కడ ధర్మ దేవత ధర్మాన్ని నాలుగు పాదాలా నడిపిస్తుందని అంటారు. ఇదొక ఆధ్యాత్మిక త్రివేణీ సంగమం. ఆంధ్రకు వెంకటేశ్వరస్వామి వారు ఎలాగో కర్ణాటకలో మంజునాథ స్వామి వారు అలాగ. ఇక్కడ వంశపారంపర్య ధర్మకర్తగా ఎంపీ వీరేంద్ర హెగ్డే ఉన్నారు. ఈయన ఇక్కడ దాదాపు ఒక సమాంతర న్యాయ వ్యవస్థను నడుపుతారు. ఈ ఆలయం ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్య, వైద్య సేవలు విశేషంగా అందుతాయి. కుటుంబ- వ్యాపార- ఇతర సమస్యలేవైనా వస్తే ఈ ప్రాంతానికే తలపెద్దగా భావించే హెగ్డే దగ్గరకొచ్చి తమ సమస్యలు పరిష్కరించుకుంటారు. ఎన్నో జంటలకు ఎంపీ వీరేంద్ర హెగ్డే ఇచ్చే తాళిబొట్టుతో పెళ్లిళ్లు జరుగుతుంటాయి. ఇక్కడ ధర్మం నాలుగు పాదాలా నడుస్తుందనడానికి ఎన్నెన్నో ఉదాహరణలు. అలాంటి ధర్మస్థల లో వందలాది హత్యలు జరిగాయని తెలియడంతో ప్రపంచమంతా షాకైంది. కంప్లయింట్ చేసిన తల్లిని బెదిరించి పంపిన పోలీసులు. ఇంతకీ ఇతడు చెప్పేదేంటని చూస్తే తన చేజేతులా.. ఎన్నో శవాలకు ఖననం, దహనం నిర్వహించానని అంటాడాయన. అంతే కాదు తనకు ఇష్టం లేకపోయినా ఎందరో మహిళలు, యువతులు, మైనర్లు మృతదేహాలను ఖననం చేశానని చెప్పుకొచ్చారు. 2010లో తానిలాగే ఒక స్కూల్ డ్రెస్ వేసుకున్న మైనర్ బాలిక మృతదేహాన్ని ఖననం చేశానని అంటాడీ మాజీ పారిశుధ్య కార్మికుడు. అంతే కాదు 2003లో అనన్య భట్ అనే ఒక ఎంబీబీఎస్ స్టూడెంట్ తన స్నేహితులతో కలసి ధర్మస్తలకు వచ్చి.. ఆపై కనిపించకుండా పోయింది. ఆ సమయంలో మృతురాలి తల్లి ఫిర్యాదు చేయగా పోలీసులు ఆమెను బెదిరించి పంపారని అంటారు. ఇక 2012లో సౌజన్య అనే మరో యువతి హత్యాచారం కేసు పై కూడా కొంత కాలంగా వివాదం చెలరేగుతోంది. తనకు ప్రాణ హాని ఉందంటోన్న మాజీ పారిశుధ్య కార్మికుడు. ఇంతకీ ఈ సఫాయి కార్మికుడు ఇక్కడి నుంచి ఎందుకెళ్లాడు? ఆ వివరాలేంటని చూస్తే.. 2014లో తన కుటుంబానికి చెందిన మైనర్ బాలికను సైతం ఇలాగే లైంగికంగా వేధించారు. దీంతో తనకు విరక్తి వచ్చి ఇక్కడి నుంచి వెళ్లిపోయానని అంటాడాయన. తనలోని పాపభీతి ఇన్నాళ్లకు నిజం బయటకొచ్చేలా చేసిందని.. తాను గత కొంత కాలంగా అపరాధభావంతో కుమిలిపోతున్నట్టు చెప్పుకొచ్చారీ మాజీ పారిశుధ్య కార్మికుడు. తానీ పని చేస్తున్నప్పటి నుంచి తప్పుగానే భావించాననీ.. అయితే బలవంతానా తన చేత ఈ దుర్మార్గపు పని చేయించారనీ.. లేదంటే చంపేస్తామంటూ బెదిరించేవారని చెబుతాడీ మాజీ సఫాయి కార్మికుడు. తనకు ప్రాణహాని ఉందని కూడా చెబుతాడితను.. ఇక్కడి వంశపారంపర్య పాలనా పరంపర అలాంటిది. అందుకే ఈ ఆలయ ధర్మకర్త వీరేంద్ర హెగ్డేకి రాజ్యసభ్యత్వం ఇచ్చి గౌరవించింది కేంద్ర ప్రభుత్వం. ఆయన ఇది వరకే పద్మ పురస్కారాలతో పాటు ఇంకా ఎన్నో విశేష పురస్కారాలు అందుకున్నారు. ధర్మస్తల అంటే ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో అంతటి అశేష సామాజిక ప్రాధాన్యత ఉంది. కార్యమేదైనా హెగ్గే అనుమతి తీస్కునే స్థానికులు. వీరేంద్ర హెగ్డే వీరికొక ధర్మాధికారి మాత్రమే కాదు. అంతకన్నా మించి. ఆయనకు పరోపకారి అన్నదొక బిరుదు. ఈ ప్రాంత కీర్తి ప్రతిష్టల పతాక.. హెగ్డే కుటుంబం. ఈ ఆలయ చరిత్రతో ఈ జైన కుటుంబ చరిత్ర అంతగా మమేమకమై కనిపిస్తుంది. వీరేంద్ర హెగ్డే కుటుంబం తరతరాలుగా ఇక్కడి స్థానికుల నుంచి నీరాజనాలు అందుకుంటోంది. ఈ ప్రాంత వాసుల ఇంట్లో ఏ శుభకార్యం జరగాలన్నా ఆ మంజునాథుడే తమకు ఆనతిచ్చినట్టుగా హెగ్డే దగ్గరకు వచ్చి అనుమతి తీసుకుని వెళ్తారు. అంతగా ఇక్కడి ఆచార వ్యవహారాలు నడుస్తాయి. వారికేదైనా వివాదం వచ్చినా తీర్చుకోడానికి ఇక్కడికే వస్తుంటారు. గతంలో గ్రామ పెద్దలు, ఊరి పెద్దల పంచాయితీలు- తీర్పులు ఎలా సాగేవో.. ఇప్పటికీ ఇక్కడ అలాగే కొనసాగుతుంటాయి. ధర్మస్థల ఉదంతానికి సంబంధించి 8,842 పోస్టులు. వివిధ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో ధర్మస్తల ఉదంతానికి సంబంధించిన 8, 842 లింకులను తొలగించాలని కోర్టు ఆదేశించింది. గతంలో తమ దగ్గర పని చేసినపారిశుధ్య కార్మికుడు చేసిన ఆరోపణలకు సంబంధించిన ఫుటేజీ పూర్తిగా తొలగించాలని, వీటిని డీ- ఇండెక్స్ చేయాలని కోరారు హర్షేంద్ర. అంతే కాదు.. తన పిటిషన్లో ఆయన ఎక్స్, ఫేస్ బుక్, థ్రెడ్ వంటి ప్లాట్ ఫామ్స్ పై పోస్టుల గురించి కూడా ప్రస్తావించారు. ఈ వివాదంపై పలు యూట్యూబ్ చానెళ్లు, సోషల్, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాలో ప్రచురించడం, ప్రసారం చేయడం, ఫార్వర్డ్ చేయడం అప్ లోడ్ చేయడాన్ని నిషేధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ధర్మస్థల మిస్టరీ మరణాల వివాదం అయితే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా వైరల్. కారణమేంటంటే ధర్మస్తల ధర్మాధికారి వీరేంద్ర హెగ్డే ఒక రాజ్యసభ ఎంపీ. ఇంతటి ప్రశాంత వాతావరణంలోని ఈ ఆధ్యాత్మిక కేంద్రంలో ఇలాంటి మారణకాండ జరగటమేంటి? ఇంతకాలం ఇదెలా గుట్టుగా ఉంది? ఎవరికీ అనుమానం రాలేదు ఎందుకని? నదిలోనూ కొన్ని మృతదేహాలు పడేశానని ఆ పారిశుధ్య కార్మికుడు చెబుతుంటే.. మరి అప్పుడే ఆ మృతదేహాలు ఎక్కడో ఒక చోట తేలి.. కనిపించేవి కదా? ఒకటి రెండు తప్ప .. మరే కేసు కూడా ఇప్పటి వరకూ ఎందుకు వెలుగులోకి రాలేదన్నది షాకింగా ఉంది. ఇటు ప్రభుత్వమే కాదు అటు, హెగ్డే కుటుంబం కూడా దీన్నించి ఎలా బయట పడాలో అర్థంకాక సతమతమవుతోంది. మరి చూడాలి.. ఈ కేసు ఏ మలుపు తీసుకుంటుందో తేలాల్సి ఉంది.

# ఆసమానాలు అటవీ రేంజర్ల త్యాగాలు



ప్రకృతిని పరిరక్షించేవారు ఆయుధాలతో కాదు... అడవిలో అడుగులు వేసే నిరాహంకార పాదాలతో, వన్య జీవులను కాపాడే మానవతా హృదయాలతో. అలాంటి అటవీ సంరక్షకులు ౹ రేంజర్లు ౹ వారి సేవలకు స్మరణార్థంగా ప్రతి సంవత్సరం జూలై 31న ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ రేంజర్ దినోత్సవం జరుపుకుంటారు. ఈ దినోత్సవం వన రక్షకుల త్యాగాలకు, వారు ఎదుర్కొంటున్న సవాళ్లకు గుర్తింపుగా, భద్రతా హక్కులపై చర్చకు వేదికగా నిలుస్తోంది. 1992లో ఏర్పడిన ఇంటర్నేషనల్ రేంజర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2007 నుంచి ఈ దినోత్సవం నిర్వహించ బడుతోంది. ఇదే తేదీన 1992లో విధిలో ప్రాణాలు కోల్పోయిన యుగాండా రేంజర్‌కు స్మారకంగా జూలై 31ను ఎంచుకున్నారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా 100కి పైగా దేశాల్లో ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు. రేంజర్ పదవిని మామూలుగా అటవీ భద్రతా ఉద్యోగిగా భావించినా... వాస్తవానికి వీరు పర్యావరణ పరిరక్షణకు, జీవవైవిధ్య సంరక్షణకు ముందు వరుసలో నిలిచే యోధులు. వారివల్లే మన అడవులు, వన్య ప్రాణులు, ప్రకృతి వనరులు కాపాడ బడతాయి. వీరు వేటగాళ్లు, అక్రమ కలప స్మగ్లర్లు, అడవిని ఆక్రమించే వారితో రోజూ పోరాడాల్సి వస్తోంది. దట్టమైన అడవులు, కఠిన వాతావరణ పరిస్థితులు, హింసాత్మక ఘటనలు వీరి పని భాగమై పోయాయి. కానీ వీరికి సరైన మౌలిక వసతులు, రక్షణా పరికరాలు, శిక్షణలు చాలా చోట్ల లేవు. ఇలాంటి పరిస్థితుల్లోనూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్నారు. గత 15 ఏళ్లలో ప్రపంచ వ్యాప్తంగా 1,700 మందికి పైగా వన రక్షకులు విధుల్లో ప్రాణాలు కోల్పోయారు. 2023లో ఒక్క ఏడాది లోనే 137 మంది రేంజర్లు మరణించారు, వీరిలో 46 మంది హత్యలు, 22 మంది వాతావరణ ప్రమాదాలు, 19 మంది వన్యప్రాణుల దాడుల్లో ప్రాణాలు విడిచారు. ప్రస్తుతం 105కి పైగా దేశాల్లో 2 లక్షల మంది వన రక్షకులు విధుల్లో ఉన్నారు. వారి ప్రాణాలకు గౌరవంగా పనిచేస్తున్న థిన్ గ్రీన్ లైన్ ఫౌండేషన్ వంటి సంస్థలు వీరి కుటుంబాలకు సహాయ పడుతున్నాయి. భారత దేశం మొత్తం 7,13,789 చదరపు కిలోమీటర్ల అటవీ భూమిని కలిగి ఉండగా, దాదాపు 2.5 లక్షల మంది అటవీ ఉద్యోగులు ఈ విభాగంలో ఉన్నారు. వీరిలో రేంజర్లు, బీట్ గార్డులు, వన్య జీవ పరిరక్షణ అధికారులు ముఖ్యులు. గడచిన 20 ఏళ్లలో 250 మందికి పైగా భారత రేంజర్లు విధుల్లో ప్రాణాలు కోల్పోయారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జారండ్, నాగలాండ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో వన రక్షకులు మావోయిస్టు దాడులు, అక్రమ వేటగాళ్ల హింసను ఎదుర్కొన్నారు. 2019లో ఛత్తీస్ గఢ్‌లో ఓ రేంజర్ మావోయిస్టుల పేలుడు బాంబులో మరణించాడు. 2021లో మాధవరావ్ నేషనల్ పార్క్‌లో ఒక జింకను రక్షించేందుకు ప్రయత్నిస్తూ ఓ రేంజర్ మరణించాడు. 2023లో ఒడిశాలోని సింహాచలం అడవిలో అక్రమ వేట నుంచి ప్రాణులను రక్షిస్తూ ఒక మహిళా రేంజర్ ప్రాణాలు కోల్పోయింది. 2024లో తెలంగాణలోని కొన్సర్ ఫారెస్ట్ రిజర్వులో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నందుకు వన రక్షకులపై సామూహిక దాడి జరిగింది. ఈ నేపథ్యంలో రేంజర్లకు ఎదురయ్యే ప్రధాన సవాళ్లు: ఆధునిక టెక్నాలజీ లేమి ౼ జీపీఎస్, డ్రోన్లు, నైట్ విజన్ పరికరాలు లేవు. భద్రతా దుస్తులు, ఆయుధాల లేమి. అల్ప వేతనాలు, రాత్రిపూట పని, మానసిక ఒత్తిడికి గురయ్యే పరిస్థితులు. విధుల్లో గాయపడినా మెరుగైన వైద్యం లేకపోవడం. మరణించిన తర్వాత కుటుంబాలకు సరైన న్యాయం, పరిహారం ఆలస్యంగా రావడం.ఈ నేపథ్యంలో కేంద్ర వనశాఖ, విధుల్లో మరణించిన రేంజర్లకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలన్న ప్రతిపాదన చేసింది. రాష్ట్రాల స్థాయిలో కూడా రేంజర్లకు విశ్రాంతి వసతులు, ఆరోగ్య శిబిరాలు, రక్షణా పరికరాలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వన రక్షకులను సైనికుల్లా గౌరవించాలి. వన యోధుడు పురస్కారం వంటి అవార్డులు ఇవ్వాలి.అటవీ సంరక్షణలో సమాజం భాగస్వామ్యంగా మారాలి. పాఠశాల స్థాయిలో నుంచే వన్యజీవ సంరక్షణపై అవగాహన కల్పించాలి. పర్యాటకులు అటవీ నియమాలను గౌరవించాలి. పౌర సమాజం రేంజర్లకు మద్దతుగా నిలవాలి. ప్రపంచ రేంజర్ దినోత్సవం అంటే కేవలం స్మరణ మాత్రమే కాదు... అది ఒక బాధ్యత. మనకు ఊపిరినిచ్చే అడవులను కాపాడే వారి పోరాటాన్ని గౌరవించాల్సిన బాధ్యత. వారు మాట్లాడే వారు కాదు, ప్రకృతికి స్వరమిచ్చే వారు. అటువంటి వనరక్షకులకు మన హృదయ పూర్వక వందనం.

# అలనాటి మేటి గాయకుడు రఫీ



హిందీ సినిమా రంగం 1950 నుండి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. ఆయన ఉత్తర భారత ప్రముఖ నేపథ్య గాయకుడు. హిందీ సినీ చిత్ర సీమలో ఒకనాడు మకుటం లేని మహారాజుగా వెలిగాడు. కేవలం రఫీ పాటలతో వందల కొద్దీ చిత్రాలు విజయం పొందాయనేది నూటికి నూరుపాళ్లు నిజం. తన గాన మాధుర్యంతో ప్రేక్షకులను అలరించిన మహ్మద్ రఫీ 24 డిసెంబర్ 1924 పంజాబ్ లోని అమృత్ సర్ లో జన్మించాడు. బాల్యంలో తమ గ్రామానికి వచ్చే ఫకీర్ల గానాన్ని రఫీ అనుకరించే వాడు. అలా చిన్నప్పుడే సంగీతంతో మక్కువ ఏర్పడింది. ఆ క్రమంలోనే ఉస్తాద్ బడే గులామ్ అలీ ఖాన్ వద్ద రఫీ సంగీత శిక్షణలో రాటు దేలాడు. అలా సినిమాల్లో పాటలు పాడడానికి 1944లో బొంబాయి వెళ్లాడు. 'గావ్ కీ గోరి' అనే హిందీ చిత్రంలో జి.ఎం.దురానీ తో కలిసి రఫీకి మొదటిసారి పాడే అవకాశం వచ్చింది. రఫీ పాడిన తొలి హిందీ గీతమిది. ఆ తర్వాత 1948లో గాంధీజీ హత్య జరిగినపుడు రఫీ 'సునో సునో ఏ దునియావాలో బాపూజీకి అమర్ కహానీ' పాటతో పాపులర్ అయ్యాడు. ఈ పాటకు భారత ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకున్నాడు. హిందీ సినిమా గాన జగత్తులో 1950 నుండి 1970 కాలం నిజంగా మహమ్మద్ రఫీ యుగం. రఫీ హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు భాషలలో పాటలు పాడాడు. 17 భాషలలో తన గానంతో అందరినీ అబ్బుర పరచాడు. రఫీ, లతా మంగేష్కర్ ల గాయక జోడీ, హిందీ నేపథ్య గాన చరిత్రలో కొత్త ఒరవడిని, రికార్డును సృష్టించింది. మహ్మద్ రఫీని వరించిన అవార్డులకు లెక్కేలేదు. కేంద్ర ప్రభుత్వంచే పద్మశ్రీ పురస్కారం, జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా అవార్డుతో పాటు పలు ఫిల్మ్ ఫేర్ అవార్డులు ఆయన్ని వరించాయి. హిందీతో పాటు 17 భారతీయ భాషల్లో 20వేలకు పైగా పాటలు పాడాడు. తొలితరం భారతీయ సినీ సంగీత సాగర ప్రయాణానికి దిక్సూచి లాంటి వాడు రఫీ. పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రిషీ కపూర్ వంటి మూడు తరాల బాలీవుడ్ నటులకు స్వరాలు అందించిన ఘనత రఫీ సొంతం. తెలుగు విషయానికొస్తే...తండ్రి ఎన్టీఆర్, కొడుకు బాలకృష్ణకు ప్లేబ్యాక్ అందించారు రఫీ. నౌషాద్ కోసం రఫీ మొత్తం 149 పాటలు, బర్మన్‌తో కలిసి 37 చిత్రాలలో పని చేశాడు, శంకర్ - జైకిషన్ కోసం రఫీ మొత్తం 341 సంఖ్యలను (216 సోలో) పాడారు. కల్యాంజీ ఆనంద్జీ రఫీ స్వరంలో సుమారు 170 పాటలు కంపోజ్ చేశారు. రవితో , మదన్ మోహన్‌తో , ఓ.పీ.నయ్యర్‌తో, లక్ష్మీకాంత్ - ప్యారేలాల్‌తో, రోషన్, జైదేవ్, ఖయ్యామ్, రాజేష్ రోషన్, రవీంద్ర జైన్, బాపి లాహిరి, సపన్ జగ్మోహన్ వంటి సంగీత దర్శకులందరికీ తరచూ పాడారు. ఉషా ఖన్నా , సోనిక్ ఒమి , చిత్రగుప్తా , ఎస్ఎన్ త్రిపాఠి , ఎన్. దత్తా మరియు ఆర్.డి బర్మన్ లాంటి సంగీత దర్శకులతో పని చేశాడు. అనేక ప్రైవేట్ ఆల్బమ్‌లను వివిధ శైలులు మరియు భాషలలో రికార్డ్ చేశాడు. గిన్నీస్ రికార్డు ప్రకారం భారతీయ భాషలలో 28,000 పాటలను రికార్డ్ చేసినట్లు పేర్కొన్నారు. రఫీ రెండు సినిమాల్లో నటించాడు. లైలా మజ్ను (1945) చిత్రంలో "తేరా జల్వా జిస్ నే దేఖా" మరియు జుగ్ను (1947) చిత్రంలో "వో అప్ని యాద్ దిలాన్ కో" పాటల కోసం తెరపై కనిపించాడు. 1948 - స్వతంత్ర భారత మొదటి సాంవత్సరిక ఉత్సవాలలో రజత పతాకాన్ని జవహర్ లాల్ నెహ్రూ చేతుల ద్వారా ప్రదానం చేయ బడింది. 1967 - భారత ప్రభుత్వంచే పద్మశ్రీ బిరుదు ప్రదానం చేయ బడింది. 2001 - హీరో హొండా, స్టార్ డస్ట్ మేగజైన్ లద్వారా "బెస్ట్ సింగర్ ఆఫ ద మిలీనియం గౌరవ ప్రదానం. 2013 - సి ఎన్ ఎన్.. ఐ బి ఎన్ పోల్ లో గ్రేటెస్ట్ వాయిస్ ఇన్ హిందీ సినిమాగా ఎన్నికయ్యాడు. "చౌధవీఁ కా చాంద్ హెూ" , "తేరి ప్యారీ ప్యారీ సూరత్ కో", "చాహూంగా మై తుఝే సాంఝ్ సవేరే", "బహారో ఫూల్ బర్సావో", "మై గావూ తుమ్ సోజావో", "ఖిలోనా జాన్ కర్", "క్యా హువా తేరా వాదా", ఇలా ఒక్కటేమిటి, రఫీ పాడిన ఎన్నో పాటలు చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలుగా మిగిలి పోయాయి. తెలుగులో ఆయన పాడిన ప్రతి పాట ఆణిముత్యమే. 'భలే తమ్ముడు' చిత్రంలోని "ఎంతవారు కానీ వేదాంతులైనా కానీ", ఎన్టీఆర్ 'ఆరాధన'లో "నా మది నిన్ను పిలిచింది గానమై".. 'అక్బర్ సలీం అనార్కలి'లో ఆయన పాడిన "సిపాయి" పాట నేటికీ తెలుగు ప్రేక్షకుల్లో మనసుల్లో అలాగే నిలిచి వుంది. 1980 జూలై 31న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆయన ఈ లోకాన్ని వదిలి వెళ్లి దాదాపు 40 ఏళ్లు దాటినా ఆయన స్వరం ప్రతిగుండెలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. అందుకే భారతీయ సినీ సంగీత ప్రపంచంలో రఫీ అమర గాయకుడిగా నిలిచి పోయాడు.

## భవిష్యత్ తరాలకు మార్గదర్శకులు

తెలుగు సాహిత్య, పత్రికా రంగంలో నిండుగా రసదాయకంగా దశాబ్దాల పాటు విస్తరించిన పేరు నండూరి పార్థసారథి. వ్యంగ్యం, హాస్యం, విమర్శ, సంగీతం, చలనచిత్రం వంటి అనేక కళా విభాగాలపై లోతైన చింతనతో రచన చేసి పాఠకులకు కొత్త పోకడలను చూపించిన అరుదైన రచయిత. 1939, జూలై 31న కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, ఆరుగొలను గ్రామంలో జన్మించిన ఆయన, 2024 జూన్ 14న హైదరాబాదులో పరమపదించగా, తన రచనల ద్వారా చిరంజీవిగా నిలిచిపోయారు. విజయవాడలో ఇంటర్మీడియట్ చదివిన ఆయన, హైదరాబాద్‌లో బి.ఏ. పూర్తిచేసి, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. పూర్తి చేశారు. విద్యార్హత మాత్రమే కాదు, అభిరుచి, పాండిత్యం కలగలిసిన భావదృష్టితో 1959లో "ఆంధ్రప్రభ" పత్రికలో పాత్రికేయుడిగా ప్రస్థానం మొదలుపెట్టారు. తరువాత ఏకకాలంలో శార్వరి, విద్వాన్ విశ్వం, గోల్లపూడి మారుతీరావుల వంటి సాహిత్య వేత్తలతో కలిసి పనిచేశారు. ఆయన రచనా నైపుణ్యం, సామాజిక పరిపక్వత, వ్యవస్థలపై వాడిగా బాణాలు ఎక్కు పెట్ట గలిగిన ధైర్యం ఆయనను పత్రికా రంగంలో విశిష్టంగా నిలబెట్టాయి. పార్థసారథి రచనలు మొదటిగా 1957లో ప్రచురితమవ్వగా, తరువాత 'రాంబాబు డైరీ' (మూడు భాగాలు), 'పిబరే హ్యూమరసం', 'అయోమయ రాజ్యం', 'సాహిత్య హింసావలో కనం', 'ఖారానాఖ్యానము', 'జేజి మావయ్య పాటలు' వంటి హాస్య రచనలతో తెలుగు పాఠకులను నవ్విస్తూ ఆలోచింపజేసే శైలిని ఏర్పరచుకున్నారు. ఆయన రచనలు కేవలం వినోదం కోసం గాక, సంఘాన్ని ప్రశ్నించే, అలసిన మానవ సమాజాన్ని చైతన్యపరచే రీతిలో సాగతీత చేశాయి. ఆయన వ్యాసాలు, సమీక్షలు, సంగీతంపై రచనలు హిందుస్తానీ సంగీతం పై నిశిత అవగాహనను చాటాయి. "స్వరార్ణవం", "సంగీత కళా చరిత్ర", "శ్రీకృష్ణ కథామృతం" వంటి రచనలు సంగీతారాధకులను ఆకట్టుకున్నాయి. నాటక, శిల్ప, చిత్రకళలపై కూడా వ్యాసాలు రాశారు. 2000 అక్టోబరులో దీపావళి సందర్భంగా ఆయన ప్రారంభించిన 'రసమయి' మాసపత్రిక (95 సంచికలు) ఒక సాంస్కృతిక వేదికగా నిలిచి, నాటకీయ సమీక్షలు, కళా విశ్లేషణలు, సంప్రదాయ-నవీన విలయ రూపంగా పాఠకులకు వినూత్న అనుభ వాన్ని అందించింది. సంపూర్ణంగా స్వంత ఖర్చుతో, సాహిత్యాన్ని సేవా ధర్మంగా భావించిన తపస్విగా ఆయన దీనిని నిర్వహించారు.తెలుగు విశ్వవిద్యాలయం 1992లో హాస్య రచనకు, 2002లో పాత్రికేయ సేవలకు ఆయనకు పురస్కారాలు అందించింది.

# ప్రభుత్వ ఆసుపత్రిలోనే సురక్షిత కాన్పులు

-మండల వైద్యాధికారి చింతల కాటంరాజు

**చౌటుప్పల్.జులై 30. ప్రభాత సూర్య :** ప్రభుత్వ ఆసుపత్రిలోనే మహిళలకు సురక్షితమైన కాన్పులు జరుగుతాయని చౌటుప్పల్ మండల వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ కాటంరాజు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశాల మేరకు గత 6 నెలలగా ప్రతినెల గర్భిణీ స్త్రీల ఇంటికి వెళ్లి సాధారణ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియపరుస్తున్నట్లు వారు తెలిపారు. ఆపరేషన్ తో కలిగే ఆర్థిక, ఆరోగ్య నష్టం గురించి వారికి అర్థమయ్యేలా చెబుతున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు చేయించుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆసుపత్రికి రెగ్యులర్ చెకప్ కు వెళ్లాలని వైద్యుల సలహా ప్రకారం మందులు, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు పండ్లు, పౌష్టికాహార కిట్లను అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు రోగులకు అందుతాయన్నారు. మహిళలు ప్రసవాల కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి డబ్బులను వృధా



చేసుకోవద్దని సూచించారు. గర్భం దాల్చిన మొదటి నెల నుంచి ప్రసవం వరకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకుంటే గర్భిణీ పేరున ప్రభుత్వ ఆర్థిక సహాయం కూడా అందుతుందని తెలిపారు. మండల వ్యాప్తంగా జరిగిన అమ్మకు భరోసా కార్యక్రమలలో మండల వైద్యాధికారి సిహెచ్



కాటమరాజు, డాక్టర్ సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రాంరెడ్డి, ఎంపీడీవో సందీప్ కుమార్, డాక్టర్ నరేష్, సిడిపిఓ వెంకటరమణ, సువర్ణ, సూర్య కళ, శోభారాణి, సత్యనారాయణ, శశికళ, ఝాన్సీ, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


## లయన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు జన్మదినం పురస్కరించుకుని అన్న ప్రసాద పంపిణీ....



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబూరావు జన్మదినం పురస్కరించుకుని లయన్స్ క్లబ్ హైదరాబాద్ హోప్ ఆధ్వర్యంలో లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 300 మంది స్థానికులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఘట్టమనేని బాబురావు జన్మదినం పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు , తమ క్లబ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు మధుసూదన్ రెడ్డి, బర్క మల్లేష్ యాదవ్, సింగదాసరి రాజశేఖర్, మారం వెంకట్, శాంతి భూషణ్ రెడ్డి, విష్ణు మూర్తి, రవీందర్, డాక్టర్ శ్రీనివాస్, మారం ప్రసాద్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ

కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు కారుపాకుల వెంకట రాములు



**పెబ్బేరు. జూలై 30 ప్రభాత సూర్య** ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరుపేద లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని.కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు కారుపాకుల వెంకట రాములు అన్నారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1 వ తేదీన శుక్రవారం రోజు ఉదయం 10 గంటలకు సహారా ఫంక్షన్ హాల్లో లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే. తూడి మేగారెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందనీ ఆయన తెలిపారు . కొత్తగా వచ్చిన . రేషన్ కార్డు లబ్ధిదారుడు తప్పనిసరిగా తీసుకపోవాలని అన్నారు. ఈ కార్యక్రమాన్నికి కాంగ్రెస్ గ్రామాల అధ్యక్షులు నాయకులు పట్టణ కాంగ్రెస్ నాయకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు

## బీసీ హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

వైద్య అధికారి. డాక్టర్ ప్రవలిక



**పెబ్బేరు జూలై 30 ప్రభాత సూర్య** పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో బీసీ హాస్టల్ విద్యార్థుల కు బుధవారం . డాక్టర్ ప్రవలిక వైద్య పరీక్షలు చేశారు .ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు గురించి వివరించి తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి అమృత్ సాగర్, హెల్త్ సూపర్వైజర్ లీలమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, లావణ్య, ఆశా కార్యకర్త సావిత్రి తదితరులు పాల్గొనారు

## తాత్కాలికంగా రోడ్డు మరమ్మత్తులు చేపట్టిన కాంగ్రెస్ నాయకులు

వర్షాకాలం నేపథ్యంలో రామడుగులో వేగంగా స్పందన

**రామడుగు, జూలై 30( ప్రభాత సూర్య):** రామడుగు మండల కేంద్రంలో వాగు బ్రిడ్జి సమీపంలో రోడ్డు మధ్యలో ఏర్పడిన పెద్ద గుంత ప్రజలకు ప్రమాదకరంగా మారింది. వర్షాకాలం నేపథ్యంలో వరద నీరు పెద్ద ఎత్తున ఈ రోడ్డుపై పారుతుండటంతో, ప్రమాదాలను నివారించేందుకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టారు. చొప్పదండి శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు, స్థానికుల విజ్ఞప్తితో స్పందించిన నాయకులు వర్షాల మధ్యలోనే చర్యలు ప్రారంభించారు. గుంతలలో మొరం పోసి లెవెలింగ్ చేయడం ద్వారా ప్రయాణికుల కోసం తాత్కాలికంగా రక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి ముదిరాజ్, రామడుగు ఎస్ఐ రాజు,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, రామడుగు



గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సీనియర్ నాయకులు జెట్టిపల్లి వీరయ్య, మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్, పోలీస్ సిబ్బంది గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రచ్చ ఫౌండేషన్, డా. చిలుకు స్వామి ఆధ్వర్యంలో విద్యార్థుల కు దుస్తులు

బూట్లు పంపిణీ

**ఆలేరు,జూలై 30( ప్రభాత సూర్య )**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని శారజీ పేట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రచ్చ ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఎంపిటిసి రచ్చ రామనర్సయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత క్రీడ దుస్తులు, డా. చిలుకు స్వామి ఆధ్వర్యంలో బూట్లు ఎ ఎన్ ఎం అనుజఆధ్వర్యంలో గుర్తింపు కార్డులను జిల్లా విద్యాధికారి సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డిఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ కష్టపడి ఇష్టంగా చదివితేనే మంచి ప్రయోజకులవుతారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛందంగా వారి సొంత నిధులచే విద్యార్థులకు క్రీడా దుస్తులు, బూట్లు, గుర్తింపు కార్డులు అందచేసిన దాతలకు డి ఈ ఓ అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని క్రమశిక్షణతో మెలుగుతూ విద్యను అభ్యసించాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని




కోరారు.ఈ కార్యక్రమం లో ఫిజికల్ డైరెక్టర్ గడసంతల చిలుకు స్వామి, ఏ ఎన్ ఎం వనజ ప్రధానోపాధ్యాయులు జ్యోతి రాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కత్తి నాగరాజు, పి ఏ సి ఎస్ డైరెక్టర్ చిలుక కిష్టయ్య, మాజి వైస్ ఎంపీపీ బెంజరం రవి, తదితరులు పాల్గొన్నారు.

## బిచ్చగాళ్ల వీర్యం అడ్డాకూలీల అండం అనే వార్తల విషయంపై లోతుగా విచారణ జరించాలి

-వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జాతీయ ఉపాధ్యక్షులు డా పీటర్ నాయక్ లకావత్



**ఖమ్మం ( సూర్య ప్రతినిధి)** కొన్ని వార్త పత్రికల్లో వచ్చిన బిచ్చగాళ్ల వీర్యం అడ్డాకూలీల అండం అనే వార్తల పై ప్రభుత్వం విచారణ జరిపించాలని వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జాతీయ ఉపాధ్యక్షులు డా పీటర్ నాయక్ లకావత్ డిమాండ్ చేశారు.చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఒక అసాంఘిక కార్యక్రమంగా భావించి బాధపడుతున్నామని ఇది మానవత్వానికి మాయని మచ్చ అని వారు పేర్కొన్నారు. దీనిపై వెంటనే ప్రభుత్వం స్పందించి లోతుగా విచారణ జరిపి నేరస్థులపై వారు ఎంతటి వారైన విడిచిపెట్టే ప్రసక్తే లేదు చాలా కఠినంగా చర్యలు తీసుకుంటూ వైద్య రంగంలో ఎవరైన ఇందులో ఉన్నారేమో పరిశీలించి సంబంధిత హాస్పిటల్స్ మూసివేయాలని వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డా. పీటర్ నాయక్ పోలీసులను కోరారు. హైదరాబాద్ నగరంలో వెలుగుచూసిన ఈ అసహ్యకరమైన మానవతా విరుద్ధమైన వీర్యం అండాల సేకరణ వ్యాపారంపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.ఇది శరీర దందా కన్నా ప్రమాదకరమైన మానవ హక్కుల దుర్వినియోగం. మానవ శరీరాన్ని వస్తువుగా మలచే సంస్కృతి ఈ దేశంలో ఎప్పటికీ తట్టుకోబడదు. పేదలను ఆర్థిక అవసరాల పేరుతో వాడుకుని వారి మనోబలాన్ని దెబ్బతీసే ఈ దారుణాలకు నేను తీవ్రంగా విరోధిస్తున్నాను. ఇది నేరం మాత్రమే కాదు మానవ విలువలపై ఉగ్రదాడి," అని డా. పీటర్ నాయక్ పేర్కొన్నారు.ఈ వ్యవహారంలో బిచ్చగాళ్లు రోజువారీ కూలీలు చదువు లేని పేద ప్రజలను మభ్యపెట్టి వారి శరీర భాగాలను అసహ్యకరమైన లాభాల కోసం వాడుకోవడం మానవ హక్కుల చట్టాలకు స్పష్టమైన అవమానం అని ఆయన అన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి అన్నిటికన్నా పవిత్రమైనది

విద్యాధికారి జయరాములు




**పెబ్బేరు జూలై 30 ప్రభాత సూర్య** పెబ్బేరు మండల కేంద్రంలో యాపర్ల గ్రామంలో జడ్. పి. హెచ్. ఎస్. ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన పలుస శంకర్ గౌడ్ సేవలు చిరస్మరణీయం అని వనపర్తి జిల్లా .బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అన్నిటికన్నా పవిత్రమైనదని చక్కటి సమాజాన్ని ఏర్పరచటంలో ఉపాధ్యాయుల పాత్ర గణనీయమైనదని ఆయన వివరించారు. 36సంవత్సరాల తన ఉపాధ్యాయ జీవితంలో విద్యార్థుల అభ్యున్నతికి పాఠశాలల అభివృద్ధికి శంకర్ గౌడ్ ఎంతో కృషి చేశారని తెలిపారు.పెబ్బేరు మండల విద్యాశాఖాధికారి జయరాములు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడికి శంకర్ గౌడ్ ఒక మార్గదర్శి అని అన్నారు.ఆయన ఉపాధ్యాయుల సమస్యలపై పాఠశాలల వసతులకోసం మంచి పోరాటం సాగించిన గొప్ప వ్యక్తి ఆయన అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట మాజీ ఎంపీపి గుంత మౌనిక, పెబ్బేరు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కరె స్వామి, స్థానిక మాజీ సర్పంచులు నరేందర్ రెడ్డి, ఆనంద్ వీపనగండ్ల ఏంఇఓ నరసింహ, ప్రధానోపాధ్యాయులు నరసింహరావు, ఎవి రావు, సరస్వతీ, వేంకటరమణ, రమేష్ బాబు, విజయవర్ధిని, బసన్న, ఉపాధ్యాయ సంఘ నాయకులు బుద్ధారెడ్డి, సూర చంద్ర శేఖర్,కళాకారులు ఉమా మహేష్, సర్వారెడ్డి,వెంకటేష్ ఉపాధ్యాయులు వెంకటేష్ మొయినుద్దీన్, ఈశ్వర్ రెడ్డి శ్రీధర్ బాలమ్మ ఇందిర స్వరాజ్యం బాబు రెడ్డి. కాంగ్రెస్ నాయకులు. సురేందర్ గౌడ్. వెంకటేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ చైర్మన్ కి అభినందనలు తెలిపిన హాకీ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్..



**గచ్చిబౌలి ప్రభాత సూర్య :** హాకీ అకాడమీ ని రంగారెడ్డి జిల్లాకు కేటాయించడం పట్ల హాకీ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. ఈ మేరకు భుధవరం హాకీ అధ్యక్షుడు కొండ విజయ్, జిల్లా ప్రతినిధులు కలసి హాకీ స్టిక్ అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. హాకీ జిల్లా అకాడమీని గచ్చిబౌలి స్టేడియం లో ఏర్పాటు చేయడం తో జిల్లాలో హాకీ మరింత పటిష్టం కావడం ఖాయమని తెలిపారు. తమ ప్రభుత్వం క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తుందని శివసేన రెడ్డి తెలిపారు. అకాడమీకి 24 బాయ్స్, 24 గర్ల్స్ ఎంపిక చేసినట్లు తెలిపారు. హాకీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని, హాకీ టోర్నమెంట్ నిర్వహణకు సహకరించాలని కొండ విజయ్ కోరారు. ఈ కార్యక్రమలో హాకీ రంగారెడ్డి సెక్రటరీ కె భాస్కర్ రెడ్డి, ట్రెజరర్ పాండు రంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యునిగా బచ్చనగోని గాలయ్య ఏకగ్రీవంగా ఎన్నిక.



**సంస్థాన్ నారాయణపురం, జూలై 30( ప్రభాత సూర్య):** సిపిఐ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యునిగా బచ్చనగోని గాలయ్య రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన సిపిఐ పార్టీ జిల్లా నాలుగవ మహాసభలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా గాలయ్య బుధవారం విలేకరులకు విడుదల చేసిన ఓ ప్రకటనలో మాట్లాడుతూ... జిల్లాలో సిపిఐ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలిచేలా పనిచేస్తానని వెల్లడించారు. తిరిగి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు సహకరించిన సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాబోయే అమ్మకు భరోసా...



**చౌటుప్పల్.జులై 30. ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం అమ్మకు భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకట్రాంరెడ్డి పట్టణ పరిధి నందలి మార్కండేయ దేవాలయం పక్కన దడిపల్లి మమత అనే గర్భిణీకి ఇంటికి వెళ్లి ప్రభుత్వ హాస్పిటల్లో ప్రసవం చేసుకోవాల్సిందిగా కోరుతూ పండ్లను గర్భిణీ స్త్రీ కి అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. ప్రభుత్వాసుపత్రిలో నిష్ణాతులైన డాక్టర్ల పర్యవేక్షణలో తల్లి బిడ్డ క్షేమంగా, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఆర్థికంగా కూడా డబ్బులు పొదుపు అవుతాయని వారికి వివరించారు. అంతేకాకుండా సాధారణ ప్రసవాల వల్ల అనేక ప్రయోజనాలను తల్లి బిడ్డ లు పొందుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ కవిత, ఆర్ పి, ఎం ఎల్ హెచ్ పి లు , ఏఎన్ఎంలు , ఆశా వర్కర్ లు , అంగన్వాడి టీచర్ లు , మహిళలు పాల్గొన్నారు.

## నూతన రేషన్ కార్డులు పంపిణీ చేసిన

మాజీ సర్పంచ్ దోనురు జైపాల్ రెడ్డి



**సంస్థాన్ నారాయణపురం, జూలై 30( ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల చిమిర్యాల గ్రామంలో నూతనంగా మంజూరైన 31 రేషన్ కార్డులు బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ దోనురు జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని , రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ నిరంతర ప్రక్రియని పేద ప్రజల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, సుర్వి రాజు గౌడ్, కేసాని దిలీప్, సుర్రి ముత్యాలు సుర్రి నరేష్, దొల గణేష్, కృష్ణ చంద్రయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ ఎన్.ఆర్.ఐలు జగనన్న నాయకత్వానికి అండగా..

-ప్రవాసాంధ్రుల మద్దతుతో బలోపేతం అవుతున్న వైఎస్ఆర్సిపి..



**అనంతపురం, జూలై 30( ప్రభుత్వ సూర్య ):** తాడేపల్లి లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైఎస్ఆర్సిపి ప్రవాస భారతీయుల నేతలు, ఎన్నారై కో- ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి సమన్వయంతో కలిశారు. ప్రవాసాంధ్రుల మద్దతు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గ్లోబల్ స్థాయిలో బలాన్ని ఇస్తోందని, పార్టీ పునర్నిర్మాణంలో ప్రవాసాంధ్రుల పాత్ర చాలా కీలకమని జగనన్న పేర్కొన్నారు. ప్రవాస నాయకులు తమ అభిప్రాయాలను జగన్మోహన్ రెడ్డికి వెల్లడించారు. ప్రజాపాలనను మళ్లీ రాష్ట్రానికి తీసుకురావాలన్న సంకల్పంతో ఈ నేతలు తమ అభిప్రాయాలు, ఆలోచనలు వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డికి, పాల్గొన్న ప్రవాస నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బారామిరెడ్డి డల్లాస్, యు.ఎస్.ఏ, మధు శ్రీధర్ యునైటెడ్ కింగ్డమ్, చాళుక్య రెడ్డి యునైటెడ్ కింగ్డమ్, హుస్సేన్ యునైటెడ్ కింగ్డమ్, గుణశేఖర్ కెనడా, అభిలాష్ కెనడా, రమేష్ పనాటి న్యూజిలాండ్, ప్రసన్నకుమార్ రెడ్డి ఆస్ట్రేలియా, ఇలియాస్ గల్ఫ్ కన్వీనర్, సయ్యద్ అక్రం దుబాయ్, గుదురు కోటేశ్వర రెడ్డి దుబాయ్, షేక్ అబ్దుల్లా దుబాయ్, అరుణ్ చక్రవర్తి దుబాయ్, చిన్న నాగముని గుండ్లూరు దుబాయ్ , షా హుస్సేన్ కువైట్ పాల్గొన్నారు.

# లక్ష్యంపై గురి పెడితే ఉన్నత స్థాయికి ఎదుగుతారు

చరవాణికి బానిసలైతే జీవితమే నాశనం...
పేదరికం ప్రతిభకు అడ్డుకారాదు...
జీనియస్ వరల్డ్ రికార్డ్ హెూల్డర్, ప్రముఖ ఇంద్రజాలికుడు గద్దపాటి రామకృష్ణ





**చౌటుప్పల్. జులై 30. ప్రభాత సూర్య :** విద్యార్థులు లక్ష్యంపై గురి పెడితే చదువుల సిరి దక్కి ఉన్నత స్థాయిని సాధించగలరని జీనియస్ వరల్డ్ రికార్డ్ హెూల్డర్, ప్రముఖ ఇంద్రజాలికుడు గద్దపాటి రామకృష్ణ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ సౌజన్యంతో చౌటుప్పల్ మండల పరిధిలోని తంగడపల్లి,దేవలమ్మ నాగారం గ్రామాలలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఇంద్రజాల ప్రదర్శనను వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కులము, మతం, పేదరికం ప్రతిభకు అడ్డు కాదని,ఎంతోమంది క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ఉన్నత స్థాయికి చేరుకున్నారని విద్యార్థులకు వివరించారు. మనిషి మెదడు కోటి కంప్యూటర్లతో సమానమని, ఎంతో శక్తివంతమైన మెదడును సరైన విధంగా ఉపయోగించుకుంటే అద్భుతాలు సాధించవచ్చునని తెలిపారు. ఎవరికైనా రోజుకు 24 గంటల సమయమే ఉంటుందని, దాన్ని సక్రమంగా ప్రణాళిక ప్రకారం వినియోగించుకోవాలని సూచించారు.సెల్ ఫోను వినియోగం సమయాన్ని తినేస్తుందని,దానికి బానిసైతే జీవితం నరకంగా మారుతుందని హెచ్చరించారు.సిగరెట్టు, గుట్కా, మద్యం అలవాటు ఎన్నో జీవితాలను నాశనం చేస్తుందని ఉదాహరించారు.విద్యార్థి జీవితం ఎంతో విలువైందనీ చెప్పారు. భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేదరికం నుంచి ప్రపంచం గౌరవించే స్థాయికి ఎదిగారని, ఆయన చెప్పినట్టుగా విద్యార్థులు పెద్ద లక్ష్యాలు పెట్టుకోవాలని వాటిని సాధించేవరకు విశ్రమించకూడదని తెలిపారు. ప్రపంచంలో ఒక మనిషిని పోలిన మనిషి మరొకరు ఉండరని నీకు నువ్వే ప్రత్యేకమని, ఉత్తమ ఫలితాలతో పాఠశాలకు,జన్మభూమికి, తల్లిదండ్రులకు గొప్ప పేరు తేవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గురువారావు, ప్రధానోపాధ్యాయురాలు ధీరావత్ భార్గవి, లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ చైర్మన్ తీరందాసు జగన్నాథ్, కార్యదర్శి ఎండి అతహర్ పాష, కోశాధికారి చిలువేరు మంగయ్య, లయన్స్ కటకం ప్రశాంత్, సంపూర్ణ చారి, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం

– టీ టీడీపీ



**నల్గొండ జులై 30 ప్రభాత సూర్య** నల్గొండ పార్లమెంట్ తెలుగుదేశం కార్యాలయంలో పార్లమెంట్ స్థాయి సమావేశం సూర్యాపేట నియోజకవర్గ మాజీ ఇంచార్జి నాతల రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర పార్టీ మాజీ అధికార ప్రతినిధి నెల్లూరు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం చేయడం కోసం, నల్గొండ పార్లమెంట్ అధ్యక్షున్ని సమర్థవంతమైన, కార్యకర్తలతో సత్సంబంధాలు కల్గి అందరిని గుర్తించే నాయకున్నీ సమర్థవంతంగా పార్టీని నడిపించే నాయకున్ని జాతీయపార్టీ అధ్యక్షులు శ్రీ నారాచంద్ర బాబు నాయుడు రాష్ట్ర పార్టీ నాయకులూ అలోచించి తగిన వ్యక్తిని ఎవరిని నియమించిన వారి నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. పార్లమెంట్ పరిధిలో పెండింగ్ ఉన్న మండల కమిటీలు 10 రోజుల్లో పూర్తి చేసి రాష్ట్ర పార్టీకి పంపించాలని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలంగ ఉన్నస్థానాల్లో పోటీ చేసే విధంగా నాయకులూ కార్యకర్తలు సమాయత్తం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్వి యాదవ్ అరుణ్ కుమార్, కృష్ణయ్య, ముత్తినేని సైదేశ్వర్ సత్యం, నాయకులూ రాములు యాదవ్, సత్యనారాయణ, గుండు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నీలకంఠ ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం...



**రామడుగు, జూలై 30,( ప్రభాత సూర్య):** రామడుగు మండలం వెలిచలా గ్రామంలో శ్రీ నీలకంఠ ఆలయ విగ్రహ ప్రతిష్టపాన కార్యక్రమానికి స్థానిక నాయకులతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం , అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానం చేశారు, వనమహెూత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయ ఆవరణంలో మొక్కలు నాటారు...

## ఆర్థిక సాయం అందజేసిన మాచర్ల సంతోష్ కుమార్



**చౌటుప్పల్. జులై 30. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మండలం, కొయ్యలగూడెం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన చేనేత కార్మికురాలు గుర్రం నర్సమ్మ ఇటీవల అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న కొయ్యలగూడెం కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ మాచర్ల సంతోష్ కుమార్ బుధవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందజేశారు. కొయ్యలగూడెం కాంగ్రెస్ పార్టీ కన్వినర్ మాచర్ల సంతోష్ కుమార్ ను కోయిలగూడెం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. కోయ్యలగూడెం గ్రామంలో ఏ పేద కార్మికునికి ఆపద వచ్చిన తనకు విషయం తెలిసిన వెంటనే వచ్చి పరామర్శించి తనకు సంతోష్ కుమార్ ఉంటాడని గ్రామస్తులు అన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పొట్టబత్ని కృష్ణ , రచ్చ ఉపేందర్,తాటి శంకర్,పెంటి వెంకటేశం,ఎక్కల్ దేవి నర్సింహా,పుట్ట శ్రీకాంత్, పెంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పేరుకేమో హైటెక్ లో చూస్తే లోటెక్కు

పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు పట్టించుకోని అధికారులు.....
నేనే బస్తీ లీడర్ అన్ని చెప్పుకోవడం తప్ప చేసేదేమీ లేదు అంటున్న స్థానికులు...







**మాదాపూర్ ప్రభాత సూర్య :** పేరుకేమో హైటెక్ లోనో చూస్తే లోటెక్కు అన్న విధంగా మాదాపూర్ డివిజన్ పరిధిలోని గుట్టల బేగంపేట్ పరిస్థితి మాదాపూర్ డివిజన్ పరిధిలోని మెగా హిల్స్, కాకతీయ హిల్స్, వడ్డెర బస్తి , మొదులుకొని మూడవ గల్లి రామరాజు కాటన్ మెయిన్ రోడ్డు వరకు ఇదే దుస్థితి. నిరంతరం రద్దీగా ఉండే ప్రాంతం ప్రజాప్రతినిధులు తిరుగుతూ ఉండే ప్రాంతంలో నాలుగు రోజులు నుండి డ్రైనేజ్ లు నిండి రోడ్డుపై పారుతూ పొంగిపొర్లుతున్న పట్టించుకున్న నాధుడే లేడంటూ ప్రజలు వాపోతున్నారు. ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాపోతున్నారు ఉదయాన్నే స్కూలుకు వెళ్లే పిల్లలా నుండి ఐటీ ఎంప్లాయిస్, వ్యాపారులు మరియు పెద్దలు అదే మురికి నీటిలో ప్రయాణిస్తూ నానా తిప్పలు పడుతున్నారు. ఈ బస్తికి నేనే లీడర్ అని కొందరు చెప్పుకొని తిరిగే వారికి ఈ సమస్య వాళ్ళ కంటికి కనబడట్లేదా అని స్థానికులు మండిపడుతున్నారు. నీల బకాయిలు చెల్లించకపోతే నల్ల కనెక్షను మరియు డ్రైనేజ్ కనెక్షన్ కట్ చేస్తామని బెదిరించే అధికారులు మరి నాలుగు రోజులు నుండి డ్రైనేజ్ పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు. వీలైనంత త్వరగా ఈ సమస్యకు పరిష్కారం అయ్యేలా చూడమని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందిస్తాం





ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**చొప్పదండి, జూలై 30( ప్రభాత సూర్య):** రేషన్ కార్డు కలిగి ఉండాలన్న ప్రతి పేదోడి కళను సాకారం చేస్తూ చొప్పదండి మండల కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో నూతన రేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తో కలిసి చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డుల ఊసే లేకుండా పేదోళ్ల పొట్ట కొట్టారని, ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా నియంత పరిపాలన కొనసాగించారన్నారు. కానీ మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వడమే కాకుండా పేదోడి కడుపు నింపాలన్న సంకల్పంతో సన్న బియ్యం పంపిణీ చేస్తూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియని ఇంకా ఎవరైనా అర్హులు ఉన్నట్లయితే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం 38 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైఅధికారులు, రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# యువత గ్రంథాలయాలను వినియోగించు కోవాలి



విశ్రాంత ఉపాధ్యాయులు ఆందోజు నాగభూషణము
ఊరూరా గ్రంథాలయాలు ఏర్పాటు కావాలి
గ్రంథాలయోద్యమకారులు అనుముల శ్రీనివాస్

**సంస్థాన్ నారాయణపురం, జూలై 30( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల జనగామ గ్రామంలో గల కాళోజి గ్రంథాలయానికి టైమ్స్ ఆఫ్ ఇండియా సీనియర్ ఎడిటర్ వడ్లపాటి శ్రీబాల 120 గ్రంథాలను అనుముల శ్రీనివాస్ ద్వారా పంపించారని గ్రంథాలయ చైర్మన్ అందోజు నాగభూషణం అన్నారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాల మీద మక్కువతో శ్రీబాల గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ చేయడం అభినందనీయం అని, అలాగే గ్రంథాలయం అభివృద్ధికి సాహితి వేత్తలు ,పుస్తకప్రియులు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ గ్రంథాలయ ఉద్యమకారులు అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛందంగా యువత ముందుకు వచ్చి గ్రంథాలయాలు ప్రారంభించాలని దాని కోసం విపంచి ఫౌండేషన్ ముందు వుంటుందని అన్నారు. ఈ కార్యక్రమం లో తండా కృష్ణంరాజు, గజవెల్లి భాస్కర్ గుప్తా ,లోడే యాదయ్య ,గంగాపురం సాయి, ఉప్పల వెంకటేష్, పోలోజు వెంకటాచారి ,కూరెళ్ళ నరసింహాచారి,గోదా మల్లిఖార్జున్, తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి క్రీడ పోటీలకు కేజీబీవీ విద్యార్థినీలు ఎంపిక



**చౌటుప్పల్.జులై 30. ప్రభాత సూర్య:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినీలు ఈనెల 29 వ తేదీ మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన అండర్14,16,18 సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలలో కేజీబీవీ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఆయా క్రీడా విభాగాలలో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల, కళాశాల స్పెషల్ ఆఫీసర్ కంది భవాని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎన్నికైన విద్యార్థినీలు వచ్చేనెల ఆగస్టు 3,4 తేదీలలో తెలంగాణ రాష్ట్రం హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ క్రీడ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అండర్ 14 విభాగంలో పి వర్షిత, బి కావ్య లు. అండర్ 16 విభాగంలో బి అంకిత, వి శ్రావణి లు, అండర్ 18 విభాగంలో సిహెచ్ మౌనిక,జి సిరి, వి భవ్యశ్రీ విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ తెలిపారు.జిల్లాస్థాయి పోటీలలో నెగ్గి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కంది భవాని, మండల విద్యాధికారి ఈ గురువారావు లు అభినందించి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దిన పాఠశాల పి.ఈ.టి పి. అనితను మండల విద్యాధికారి ఈ గురువారావు, స్పెషల్ ఆఫీసర్ కంధి భవాని లు ప్రత్యేకంగా అభినందించారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత




చౌటుప్పల్.జులై 30.ప్రభాత సూర్య : యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని వలిగొండ ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం సుమారు ఉదయం ఏడున్నర గంటల సమయంలో పెట్రోల్ మొబైల్ -1 పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న టీజీ 29 టి 3993 నెంబర్ గల వాహనాన్ని ఆపి తనఖీ చేయగా అందులో 9 ఆవులు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సిఐ మన్మధ కుమార్ తెలిపారు. నిందితులు పశువులను కోదాడ సంత నుండి కొనుగోలు చేసి బహదూర్ పూర్ హైదరాబాద్ కు తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. వాహన డ్రైవర్ సట్టు సందీప్ (29) పై కేసు నమోదుచేసి వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని సిఐ తెలిపారు.

## సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యునిగా పల్లె శేఖర్ రెడ్డి

**చౌటుప్పల్.జులై 30.ప్రభాత సూర్య :** కమ్యూనిస్టు పార్టీ సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా 4 వ మహాసభ ఈనెల 29న వలిగొండ మండలంలో సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు.ఈ మహాసభలో సిపిఐ యాదాద్రి జిల్లా కార్యవర్గ సభ్యునిగా చౌటుప్పల్ పురపాలక కేంద్రానికి చెందిన పల్లె శేఖర్ రెడ్డిని ఎన్నుకున్నారు. పల్లె శేఖర్ రెడ్డి గత 25 సంవత్సరాల నుండి విద్యార్థి సంఘం నాయకుడిగా, చౌటుప్పల్ మున్సిపాలిటీ శాఖ కార్యదర్శిగా, చౌటుప్పల్ మండల పార్టీ కార్యదర్శిగా పలు విశేష సేవలను అందించారు.పట్టణ కేంద్రంలో సిపిఐ పార్టీని పటిష్టంగా ఏర్పాటు చేయడంలో ముఖ్య నాయకులతో కలిసి కీలక పాత్రను పోషించారు.పార్టీ కోసం పల్లె శేఖర్ రెడ్డి అందించిన సేవలను గుర్తించి పార్టీ జిల్లా నాయకత్వం పల్లె శేఖర్ రెడ్డిని జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ..తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తూ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.తన ఎన్నికకు సహకరించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకి, సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్ల వెంకట్ రెడ్డికి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకి, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డికి, గోదా శ్రీరాములుకి,తన సహచరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి భూమి పూజ



**నల్గొండ జులై 30 ప్రభాత సూర్య** నల్గొండ జిల్లా కేంద్రం లోని సాగర్ రోడ్డులో గల మెడికల్ కళాశాల సమీపంలో 22 ఎకరాల్లో, రూ. 200 కోట్ల వ్యయంతో ప్రపంచ స్థాయి నాణ్యత ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరగనుంది. ఈ స్కూల్ నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఉత్తమ వసతులు, స్కిల్ డెవలప్మెంట్ బ్లాకులు, క్రీడా మైదానాలు, అకాడెమిక్, స్టాఫ్ బిల్డింగ్స్ ఉండేలా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అదే రోజు ప్రారంభమయ్యే నూతన మంత్రి క్యాంప్ కార్యాలయ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై కూడా సమీక్ష నిర్వహించబడింది. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం నల్లగొండకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు

## సుక్క జలంధర్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన

బిజెపి మండల ప్రధాన కార్యదర్శి – బండమీది కిరణ్ కుమార్



**సంస్థాన్ నారాయణపురం, జూలై 30( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పుట్టపాక గ్రామానికి చెందిన సుక్క జలంధర్ అనారోగ్యంతో మృతి చెందాడు వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బండమీది కిరణ్ కుమార్. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బండమీది రాజు, కొలను నరేష్, మేకల గణేష్, గ్రామస్తులు ఏర్పుల రమేష్, నరసింహ, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి

**జగిత్యాల :** పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈ సంవత్సరం గడిచిన 6 నెలలో అన్ని పోలీస్ స్టేషన్లు మరియు ఇతర కార్యాలయాల పనితీరుపై, అన్ని రకాల నేరాల హెచ్చుతగ్గులపై ఎస్పీ సమీక్షించారు.గత సంవత్సరంతో పోలిస్తే ఏ నేరాలు పెరిగాయో వాటి కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులపైనా సమీక్షించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గడిచిన ఆరు నెలల్లో పోలీస్ స్టేషన్ యొక్క పనితీరును, కేసుల చేదనలో సాధించిన పురోగతిని అంచనా వేసుకుంటూ రానున్న ఆరు నెలల్లో మరింత దృఢ నిశ్చయతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. డిఎస్పీ లు, సి.ఐ లు తమ పరిధిలో ఉండే పోలీస్ స్టేషన్ లలో నమోదైన వివిధ రకాల కేసులు యొక్క స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత ఎస్.ఐలకు కేసుల దర్యాప్తు కు సంభందించి సూచనలు ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా మహిళల భద్రతే లక్ష్యంగా పని చేయాలని మహిళలు చిన్నపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ,ఎలాంటి దాడులకు పాల్పడిన వారిపై చట్టపరం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నేర నియంత్రణలో బాగంగా సొసైటీ పర్ పబ్లిక్ సేఫ్టీ లో బాగంగా ప్రతి పట్టణంలోని కాలనీల్లో,గ్రామాలలో, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేల ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు.రాబోవు రోజులో కురిసే వర్షాల దృష్ట్యా ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రణాళికా బద్దంగా పని చేయాలని అన్నారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పర్చాలని సూచించారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ఒక స్పెషల్ టీం ను నియమించి వాటి నివారణకు కృషి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు, వాహన తనిఖీలు నిర్వహించాలని అన్నారు.




# ఆగని అక్రమ నిర్మాణాలు

కొన్ని ప్రాంతాలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అడ్డుకోవలసిన అధికారులలే దగ్గరుండి రాత్రి సమయంలో నిర్మాణాలు చేయిస్తున్నారు


వనపర్తి జిల్లా కేంద్రంలోని

కొన్ని ప్రాంతాలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అడ్డుకోవలసిన అధికారులలే దగ్గరుండి రాత్రి సమయంలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు.

ఔట్సోర్సింగ్ అధికారి పేరు చెప్తే చాలు.. అధికారులు జంకుతున్నారు..

ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పదుల సంఖ్య లో పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి.

జీప్లస్ టూ కి అనుమతులు తీసుకొని ఎలాంటి నిబంధనలు పాటించకుండా రోడ్డును సైతం ఆక్రమించుకొని సెల్లార్లను తవ్వి జీ ప్లస్4, జీ ప్లస్5 నిర్మాణాలు చేపడుతున్నారు.



**వనపర్తి ప్రభాత సూర్య ప్రతినిధి..** వనపర్తి పట్టణ శివారులో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతుంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో పైఅధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అక్రమ నిర్మాణాదారులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు తమకేమి పట్టిందిలే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు.పట్టణము వేగంగా అభివృద్ధి జరుగుతున్న క్రమంలో వనపర్తి మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాల పడగ విప్పి కాటేస్తుంది. ప్రధానంగా కొత్తకోట రోడ్ లోని ట్రెండ్స్ బట్టల షాపు పక్కన ఉన్న ప్లాట్ లో సెల్లార్ నిర్మాణం కోసం పర్మిషన్ లేదు ఈ నిర్మాణాలు రాత్రి సమయంలో కొనసాగిస్తున్నారు. నిర్మాణాల పట్ల అధికారులు పట్టించుకోకపోవడం పట్ల అధికారులపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వనపర్తిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తొంగి చూసే నాథుడే కరువయ్యాడు. అధికారులు, ప్రజా ప్రతినిధుల మౌనం కాస్త అక్రమ నిర్మాణదారులకు వరంలా మారింది. దీంతో తాము ఇష్టం వచ్చినట్లుగా అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. మున్సిపాలిటీలోని అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. పదుల కొద్ది భవనాలకు ఎలాంటి అనుమతులు ఉండకపోవడంతో పాటు భవనాలకు తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా అంతకు మించి భవనాలను నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతుందని తెలిసినా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. వనపర్తి మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేయకుండా ఏం చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులకు అన్ని తెలిసే మౌనంగా ఉంటున్నారని మరికొందరు ఆరోపిస్తున్నారు. టౌన్ప్లానింగ్ అధికారుల మౌనం అక్రమ నిర్మాణదారులకు వరంలా మారిందని అంటున్నారు. వనపర్తి మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలను చూసి చూడనట్లుగా వదిలేస్తున్నారంటే అందులో మతులబు ఏంటా ప్రజలు పలు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఆదాయానికి దీని ద్వారా భారీగా గండి కొడుతున్నా అధికారులు నిర్మాణదారులతో చేతులు కలిపి ఇలా చేస్తున్నారని ఆరోపించారు. నిర్మాణదారులు ఇచ్చే ముడుపులకు ఆశపడే అధికారులు మౌనం వహిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ముడుపుల కోసమేనా మౌనం..? వనపర్తి మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు మౌనం వహించేది కేవలం ముడుపుల కోసమేనా అని సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత భారీ మొత్తంలో అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారంటే ఎంత పెద్ద మొత్తంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చని స్థానికులు అంటున్నారు. ముడుపుల కోసం పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అక్రమ నిర్మాణాలకు కొమ్ము కాయకుండా అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# త్వరలోనే కళికోట సూరమ్మ చెరువు కుడి ఎడమ కాల్వల పనులు ప్రారంభం

ఇప్పటికే మత్తడి నిర్మాణం పూర్తి

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కళికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు పై సమీక్ష సమావేశంపాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సత్యా ప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు



**జగిత్యాల :** త్వరలోనే కళికోట సూరమ్మ చెరువు కుడి ఎడమ కాల్వల పనులు ప్రారంభం కానున్నాయిని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు..బుధవారం భీమారం మండల కేంద్రంలో భీమారం, మేడిపల్లి, కథలాపూర్ మూడు మండల ప్రజల జలప్రదాయని కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు పై జిల్లా కలెక్టర్ సత్యాప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక రివ్యూ ఏర్పాటు చేశారు .... ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్మాట్లాడుతూ కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు పనులను ముమ్మరంగా కొనసాగించవలసిందిగా కాంట్రాక్టర్ కు సూచించడం జరిగింది అన్నారు.. గత ప్రభుత్వ హయాంలో మిగిలిపోయిన 3 ఎకరాల భూ సేకరణ నష్ట పరిహారాన్ని జిల్లా కలెక్టర్ తో మాట్లాడి వారికి ఇవ్వడం జరిగింది అన్నారు . స్టేజి 2 ఫేస్ 1 శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా 2005లో 1731 కోట్లతో దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు..రైతులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతుందని తెలిపారు...ఆనాడే నిధులు మంజూరు అయిన పనులు పూర్తి చేయలేదన్నారు.. 2018 ఎన్నికల్లో 200 కోట్లతో ఆనాడు అప్పటి మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా ఫౌండేషన్ ఏసి ఈ దసరా కే నీళ్లు ఇస్తామని చెప్పి అలాంటి దసరాలో ఎన్ని పోయినా కానీ ప్రాజెక్టు నిర్మాణంలో ముందడుగు లేదని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున అనేక ఆందోళనలు చేశామని గుర్తు చేశారు.. గత పది సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం చేయకుండా నిర్లక్ష్యం చేశారు..మేము 37 సార్లు ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేయాలని, అనేక సార్లు, ప్రాజెక్టు సందర్శనలో భాగంగా అప్పటి పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఇతర ప్రముఖులు ప్రాజెక్టును సందర్శించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే శరవేగంగా పూర్తి చేస్తామని మాట ఇచ్చారని, నేడు ఎమ్మెల్యేగా తను పార్టీ ప్రభుత్వం అధికారంలో రావడంతో పనులు శరవేగంగా కొనసాగుతుందని తెలిపారు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కాలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు పనుల సకాలంలో పూర్తి చేయాలని అధికార్లకు సూచించారని, రాష్ట్రంలోని మొదటి ప్రాధాన్యత క్రమంలో పూర్తీ చేసే వాటిలో చేర్చి 350 కొట్లు రాష్ట్ర బడ్జెట్లో కేటాయించడం జరిగిందని ఇప్పటికే మొత్తం నిర్మాణం పూర్తయిందని తెలిపారు..2018 లో బిఆర్ఎస్ వారు కనీసం భూ సేకరణ కోసం కూడా డబ్బులు లేకుండా ఎన్నికల్లో ఓట్ల కోసమే శంకుస్థాపన చేశారు.. ప్రజా ప్రభుత్వ అధికారంలోకి రాగానే కూడి ఎడమ కాలువల నిర్మాణానికి 500 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు.. మొదటి దఫా భూసేకరణ కు 10 కోట్ల నిధులు మంజూరీ అయి జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి చొరవతో త్వరలోనే కుడి ఎడమ కాలువల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.. గత ప్రభుత్వ హయాంలో 75 కోట్ల కాంట్రాక్టర్కు బకాయి పెడితే ప్రజా ప్రభుత్వం వచ్చాక వాటిని చెల్లించడం జరిగింది అని తెలిపారు...గత ప్రభుత్వం రాజన్న ఆలయ అభివృద్ధి చేస్తానని చెప్పి మోసం చేసిందన్నారు.. రానున్న రోజుల్లో వేములవాడ నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని పేర్కొన్నారు...ఈ కార్యక్రమంలో కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జివాకర్ రెడ్డి, ఫారెస్ట్ అధికారి రవి ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## టీసీఎస్ లేఆఫ్స్ వేళ.. ఇన్ఫోసిస్‌లో 20 వేల ఉద్యోగాలంటూ కీలక ప్రకటన

**హైదరాబాద్ :** భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించి ఉద్యోగులకు షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది కల్లా తన మొత్తం ఉద్యోగుల్లో 2 శాతం అంటే దాదాపు 12,200 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. టీసీఎస్‌లో ఉద్యోగుల తొలగింపు వేల దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ తాజాగా కీలక ప్రకటన చేసింది.ఈ ఏడాది సుమారు 20 వేల మంది కాలేజ్ గ్రాడ్యుయేట్లను నియమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. ఓ జాతీయ మీడియాతో ఇన్ఫీ సీఈఓ సలీల్ పరేఖ్ మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 17 వేల మందికిపైగా ఉద్యోగులను నియమించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కంపెనీ ఎక్కువగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే భారీగా హైరింగ్‌కు సిద్ధమవుతున్నామని సీఈఓ తెలిపారు.‘ఈ ఏడాది మొదటి త్రైమాసికంలోనే 17 వేల మందికి పైగా నియమించుకున్నాం. మొత్తం 2025 సంవత్సరానికి 20 వేల మంది కాలేజ్ గ్రాడ్యుయేట్లను నియమించుకోవాలని భావిస్తున్నాం. కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ మార్పులు, తదితర రంగాల్లో ఇన్ఫోసిస్ ఇప్పటికే పెట్టుబడులు పెట్టింది. ఇప్పటివరకు సంస్థ దాదాపు 2.75 లక్షల మంది ఉద్యోగులకు వివిధ స్థాయిల్లో డిజిటల్, ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చింది’ అని సీఈఓ వెల్లడించారు.

# రేషన్ కార్డు నిరంతర ప్రక్రియ







**మేడిపల్లి :** రేషన్ కార్డు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని వేములవాడ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం రోజున వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి మండలంలోని పీఎన్ఆర్ గార్డెన్ లో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో నూతనంగా మంజూరైన 480 కొత్త తెల్ల రేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేములవాడ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమ కోసం పాటు పడుతుందని, వారి అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. రేషన్ కార్డు అనేది నిరంతర ప్రక్రియ అని వాటిలో మార్పులు ? చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. తెల్ల రేషన్ కార్డు ద్వారా మనిషికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను అందజేస్తున్నదని సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు మహాలక్ష్మి పథకం అందించి ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించి, మహిళలను కోటీశ్వరులు చేయాలన్న ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎన్నో కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేస్తున్నదని వీటన్నిటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం కొత్త కార్డు రాని వారు ఇబ్బందులు పడాల్సిన పని లేదని, రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. ప్రతి పేదవాడికి రేషన్ కార్డు ఒక ఆత్మగౌరవమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి పేదవాడి అవసరాన్ని గుర్తించిందని తెలిపారు. ఇందులో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్ కార్డు అందిస్తోందని అన్నారు. ఈ కార్డు పంపిణీ ప్రక్రియ నిరంతరమని, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, నియోజకవర్గంలో తొలి విడతగా 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. రానున్న కాలంలో ప్రతి అర్హునికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని అన్నారు. రేషన్ కార్డుల్లో పేర్లు లేకపోవడం వల్ల మహిళలే ఎక్కువగా ఇబ్బంది పడ్డారని, మహిళల పేరు నమోదు అవ్వడమే కాకుండా, కుటుంబ రేషన్ కార్డులో యజమానిగా ఉండడం మంచి విషయమని అన్నారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి, సివిల్ సప్లై అధికారి జితేందర్ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎమ్మార్వో, ఎంపిడిఓ, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

### అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఆదేశం

**హైదరాబాద్ :** ఆగస్టు 15న గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఆదేశించారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో సీనియర్ అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నివాళులు అర్పించనున్నారని, అనంతరం చారిత్రాత్మక గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారని, అందుకు కావాల్సిన ఏర్పాట్లపై అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని, ఈ కార్యక్రమానికి ప్రముఖులు హాజరవుతున్న సందర్భంగా తగిన భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా తెలంగాణ శాసనసభ, హైకోర్టు, రాజ్ భవన్, సచివాలయం, తెలంగాణ తల్లి విగ్రహాలు వంటి ప్రముఖ ప్రభుత్వ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. గోల్కొండ కోటలో జరిగే అధికారిక వేడుకల్లో భాగంగా రాష్ట్ర వారసత్వం, దేశభక్తిని ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని సాంస్కృతిక శాఖను ఆదేశించారు.అత్యవసర పరిస్థితులను దృష్టి పెట్టుకొని అందుకు అవసరమైన అగ్నిమాపక భద్రతా సిబ్బంది, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించారు.



# ఆ విషయంలో మేము పాస్ అయ్యాం : నాగవంశీ

'ఈమధ్య కాలంలో సినిమాలకు ఓపెనింగ్స్ రాబట్టడం పెద్ద ఛాలెంజ్ అయిపోయింది. ఆ పరంగా చూస్తే మేము(కింగ్‌డమ్) పాస్ అయ్యాం. బుకింగ్స్ బాగున్నాయి. మంచి వసూళ్లతో సినిమా ఘన విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను'అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే హీరోహీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'కింగ్‌డమ్'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సత్యదేవ్ కీలక పాత్ర పోషించాడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం తాజాగా మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నాగ వంశీ మాట్లాడుతూ.. 'ఇది పూర్తిస్థాయి యాక్షన్ చిత్రం కాదు. గౌతమ్ తిన్ననూరి శైలి ఎమోషన్స్ ఉంటాయి. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే అంశాలతో తెరకెక్కిన గ్యాంగ్ స్టర్ డ్రామా ఇది. ఈ సినిమా కోసం సెట్స్ వేయలేదు. ఎక్కువ భాగం రియల్ లొకేషన్స్ లో షూట్ చేశాం. మా టీమ్ పడిన కష్టం మీకు తెర మీద కనిపిస్తుంది." అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. 'జెర్సీ' సినిమా తీసిన గౌతమ్ తిన్ననూరి 'కింగ్‌డమ్' ఇది. ఈ చిత్రంలో భావోద్వేగాలు కట్టిపడేస్తాయి. చరిత్రలో ఏ యుద్ధం చూసుకున్నా.. కుటుంబం కోసమో, పుట్టిన నేల కోసమో, ప్రేమ కోసమో ఉంటుంది. ఈ యుద్ధం కూడా అలాంటిదే. కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. సినిమా మొదలైన రెండు నిమిషాలకే ప్రేక్షకులు 'కింగ్‌డమ్' ప్రపంచంలోకి వెళ్తారు. థియేటర్ కి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం మంచి అనుభూతిని ఇస్తుంది." అన్నారు. 'విజయ్ లాంటి నటుడితో కలిసి నటించడం సంతోషంగా ఉంది. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని భాగ్యశ్రీ బోర్సే అన్నారు.

# సరికొత్త అందాలతో మెరిసిన ఖుషి కపూర్..



# హీరో, దర్శకుడు నన్ను ట్రై చేశారు..
## నిత్యా మీనన్ షాకింగ్ కామెంట్స్



మల్టీటాలెంటడ్ యాక్టర్స్‌లో నిత్యా మీనన్ ఒకరు. అలామొదలైంది సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు ఆ తర్వాత చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. ఈ మధ్య కాలంలో సినిమాల స్పీడ్ తగ్గించింది. స్లో అండ్ స్టడీగా సినిమాలు చేసుకుంటూ వెళుతుంది. 'అలా మొదలైంది' నుంచి 'భీమ్లా నాయక్' వరకూ విభిన్న పాత్రలతో ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ రీసెంట్‌గా తమిళ స్టార్ విజయ్ సేతుపతితో కలిసి సార్ మేడమ్ అనే చిత్రం చేసింది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొంటూ ఆసక్తికర విషయాలు తెలియజేస్తుంది. నిత్యా మీనన్, విజయ్ సేతుపతి జంటగా నటించిన సార్ మేడమ్ చిత్రం తమిళంతో పాటు తెలుగులో కూడా విడుదల కాబోతోంది. పాండిరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని టీజీ త్యాగరాజన్ సమర్పణలో, సత్య జ్యోతి ఫిల్మ్స్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించారు. ఆగస్టు 1న గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రమోషన్స్ జోరుగా జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో నిత్యా మీనన్ పాల్గొంది. ఈ సందర్భంగా పెళ్లిపై ఆమెకు ప్రశ్న ఎదురైంది. దానికి సమాధానంగా నన్ను విజయ్ సేతుపతి గారు, దర్శకుడు పాండిరాజ్ గారు చాలా ట్రై చేశారు" అని నవ్వుతూ చెప్పింది. అయితే ఇది కొంచెం డబుల్ మీనింగ్‌గా అనిపించడంతో వెంటనే విజయ్ సేతుపతి జోక్యం చేసుకొని.."సరిగ్గా చెప్పు.. వేరే అర్థాలు వస్తాయి!" అని అన్నారు. దీనిపై వెంటనే నిత్యా క్లారిటీ ఇచ్చింది. "అయ్యో, నేను అలా అనలేదు! పెళ్లి విషయంలో వాళ్లు నన్ను మోటివేట్ చేస్తూ ఉండేవాళు అని చెప్పాలనుకున్నాను" అని వివరణ ఇచ్చింది. ఈ సంఘటనతో అక్కడున్నవారంతా తెగ నవ్వేశారు. ఇక ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది నిత్యా మీనన్ ఇప్పటివరకు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పలు హిట్ చిత్రాల్లో నటించి మంచి పేరు తెచ్చుకుంది. ఆమె 6 భాషల్లో మాట్లాడగలదనే టాక్ కూడా ఉంది. విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ ఇద్దరికీ తెలుగు ప్రేక్షకుల్లో భారీ ఫాలోయింగ్ ఉంది. అందుకే 'సార్ మేడమ్' సినిమా తెలుగులో కూడా మంచి రెస్పాన్స్ పొందే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది.

# విజయ్ దేవరకొండతో మరోసారి రష్మిక?



టాలీవుడ్ స్టార్ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా మరోసారి కలిసి నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ వచ్చి మంచి విజయాలు అందుకున్నాయి. దీంతో ఈ హిట్ జోడి మళ్లీ తెరపై రోమాన్స్ చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. టాక్సీవాలా, శ్యామ్ సింగరాయ్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రాహుల్ సాంకృత్యాయన్ విజయ్ దేవరకొండతో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. టాక్సీవాలా తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో మంచి అంచనాలు ఉన్నాయి. వీడీ 14గా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ నిర్మిస్తుండగా.. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో రాయలసీమ నేపథ్యంలో ఈ చిత్రం రాబోతుంది. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే షూటింగ్ ప్రారంభించనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాలో కథానాయికకు సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ మూవీలో కథానాయికగా మేకర్స్ రష్మిక మందన్నాని అనుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే ఫ్యాన్స్‌కి పండగనే చెప్పుకోవాలి. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సినిమాల విషయానికి వస్తే.. కింగ్‌డమ్ సినిమాతో విజయ్ గురువారం ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నాడు. రష్మిక విషయానికి వస్తే.. ప్రస్తుతం మైసా అనే చిత్రంలో నటిస్తుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.